ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

మంగళవారం 22 ఏప్రిల్ 2025



ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్టం	కనిష్టం
నెల్లూరు	38.4	28.4
కావలి	37	27
ఆత్మకూరు	39	25
ఉదయగిరి	39	26
కందుకూరు	36	27



పసిడి ధర పైపైకి!

బంగారం అనేది ఓ ఆస్తి. దాన్ని పెట్టుబడికి, భవిష్యత్ అవసరాల కోసం వినియోగిస్తారు. అందుకనే సామాన్యుడి నుంచి కోటీశ్వరుల వరకు బంగారంపై పెట్టుబడులు పెడుతుంటారు. అయితే, ఇప్పుడు బంగారం గురించి మాట్లాడడానికి కూడా ధైర్యం చాలడం లేదు. మొన్నటి వరకు 10 గ్రాముల (24 క్యారెట్లు) బంగారం ధర రూ.90వేలుగా ఉండేది. ప్రస్తుతం ఏకంగా రూ.లక్షకు ఎగబాకింది. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు బంగారం ధర 26 శాతం పెరిగింది.

● రోజురోజుకి పెరుగుతున్న బంగారం రేట్లు ● పది గ్రాములు రూ.90వేలు పైమాటే!

ప్రపంచ పరిస్థితులే కారణమంటున్న వ్యాపారులు



నేడు బంగారం 24 క్యారెట్లు 10గ్రాములు రూ.96,590 ఉండగా, దానికి మూడు శాతం జీఎస్‌టీ కలిపితే రూ.99,488 అవుతుంది. ఏప్రిల్ 2న 10గ్రాములు 24 క్యారెట్లు ధర రూ.94వేలు, ఏప్రిల్ 9కి తగ్గుతూ వచ్చి రూ.90,960కి చేరింది. ఏప్రిల్ 10 నుంచి నేటి వరకు బంగారు ధరలు పెరుగుతూనే ఉన్నాయి.

● ప్రపంచ పరిస్థితులే కారణం

వ్యాపార వర్గాల మాటల్లో చెప్పాలంటే ప్రస్తుతం ప్రపంచ వాణిజ్యంలో ఒడుదొడుకుల కారణంగా బంగారం ధర ఆకాశాన్ని అంటిందన్నారు. చైనా కొన్ని నెలలుగా డాలర్లకు బదులు బంగారం నిల్వలు పెంచుతోంది. అమెరికా వాణిజ్య విధానాలతో పన్నుల మోత కారణంగా అగ్రదేశాలతోపాటు చిన్న చిన్న దేశాలు సైతం ఆర్థిక ఒడుదుడుకులకు గురవ్వుతున్నాయి. బంగారం అవసరంలేని దేశాలు కూడా బంగారాన్ని నిల్వ చేయడంతో డిమాండ్ పెరిగింది. అంతేకాక భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తలు చోటుచేసుకున్న రష్యా, ఉక్రెయిన్, ఇరాన్, ఇరాక్, దేశాల మధ్య యుద్ధాలు కూడా కారణమవుతున్నాయి.

స్టాక్ మార్కెట్‌లో అస్థిరత, అనిశ్చతలు ఏర్పడడంతో పెట్టుబడుదారులు బంగారంపై పెట్టుబడికి ఆసక్తి కనబరుస్తున్నారు. జిల్లాలో 2025 ప్రారంభం నుంచే బంగారం వ్యాపారం డీలా పడింది. ధరలు తేడాలు రావడంతో వ్యాపారాలు తీవ్రనష్టాలకు గురవుతున్నారు. కొంతమంది చిన్న, మధ్య తరగతి బంగారు వ్యాపారులు దుకాణాలే తెరవడంలేదు.

● తగ్గిన కొనుగోళ్లు

ప్రస్తుతం పెళ్ళిళ్ల సీజన్ అయినా ప్రజలు బంగారు నగలు కొనడం తగ్గించేశారు. వధూవరులు బంగారం కొనుగోళ్లను వాయిదా వేసుకుని, దానికి బదులు నగదు తీసుకుంటున్నారు. జిల్లాలో రైతుల పంటలకు ధరలు తక్కువగా ఉండడం కూడా బంగారం కొనుగోళ్ల తగ్గుదలకు కారణమయింది. అక్షయ తృతీయ తదితర పండుగలకు కూడా గత నాలుగేళ్లగా కార్పొరేట్ దుకాణాల లోతప్ప ఇతర బంగారు అంగళ్లలో కొనుగోళ్ల, తక్కువగా జరుగుతున్నాయి. బంగారం నగలకు ప్రత్యామ్నాయంగా ప్రజలు గోల్డ్ కవరింగ్, వెండి ఆభరణాల కొనుగోళ్లపై ఆసక్తి కనపరుస్తున్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య, (ఆంధ్రజ్యోతి) : విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం ఉచిత ప్రవేశా లకు మే 15వతేదీలోగా **cse.ap.gov.in** అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈ వో ఆర్.బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు ప్రస్తుత చిరునామా కోసం తల్లిదండ్రుల ఆధార్, ఓటరు కార్డు, రేషన్‌కార్డు, భూమి హక్కు పత్రం, ఉపాధి హామీ జాబ్ కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, కరెంట్‌బిల్లు, అద్దె ఒప్పందపత్రంతో పాటు పిల్లల వయసు ధ్రువీకరణ పత్రం సమర్పించాలన్నారు. అలాగే సీబీఎస్ఈ, ఐబీ, ఐసీఎస్ఈ పాఠశాలల్లో ప్రవేశాలకు 2025 మార్చి 31నాటికి ఐదు సంవత్సరాలు, రాష్ట్ర ప్రభుత్వ సిలబస్ పాఠశాల్లో ప్రవేశాలకు జూన్ 1 నాటికి ఐదేళ్ల పూర్తయి ఉండాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయా డేటా ఆధారంగా మే 16 నుంచి 20వతేదీ వరకు విద్యార్థుల ప్రవేశానికి అర్హతలు నిర్ణయిస్తామ న్నారు. లాటరీ ద్వారా తొలి విడత ఫలితాలను మే 21 నుంచి 24వతేదీ మధ్య విడుదల చేస్తామన్నారు. సీట్లు పొందిన విద్యార్థుల ప్రవేశాల నిర్ధారణ జూన్ 2న చేసి, ఫలితాలను జూన్ 6న విడుదల చేస్తామని తెలిపారు.

24న కోవూరు షుగర్స్ సమావేశం

కోవూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కోవూరు సహకార చక్కెర కర్మాగారం భూమిని ఏపీఐఐసీకి కేటాయించాన్ని నిరసిస్తూ ఈ నెల 24వ తేదీన సమావేశం నిర్వహిస్తున్నట్లు చెరకు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి గండవరపు శ్రీనివాసులురెడ్డి కోరారు. సోమవారం పట్టణంలోని సీతా పోలయ్య భవన్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 124 ఎకరాల విస్తీర్ణంలోని చక్కెర కర్మాగార భూమిని హస్తగతం చేసుకునేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఏపీఐఐసీకి ఫ్యాక్టరీ స్థలం కేటాయించడాన్ని నిరసనగా జరిగే ఈ సమావేశానికి చెరకు రైతుల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవీంద్రన్, రాష్ట్రకమిటీ ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ పాల్గొంటారని పేర్కొన్నారు. కాబట్టి రైతులు, షేర్‌హోల్డర్లు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా నాయకులు మూలి వెంగయ్య, మారుబోయిన సుబ్బారావు, గండవరపు శేషయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

1న సీఎం చంద్రబాబు రాక

ఆత్మకూరులో ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు

పారిశ్రామిక అభివృద్ధిపై దృష్టి

ఆత్మకూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మే 1వ తేదీన ఆత్మకూరుకు రానున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ క్రమంలో సోమవారం ఆర్డీవో బి పావని, డీఎస్పీ వేణుగోపాల్, సీఐ జి గంగాధర్, మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్ తదితరులు ఆత్మకూరులో హెలిప్యాడ్‌ను, నారంపేట వద్ద ఉన్న ఇండస్ట్రియల్ పార్కు తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఆత్మకూరు సమీపంలోని నారంపేట వద్ద ఉన్న ఇండస్ట్రియల్ పార్కులో పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపన, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన అధికారికంగా ఖరారు కావాల్సి ఉంది.

ఆర్ఐవో శ్రీనివాసులు బదిలీ

చిత్తూరు డీఐఈవోగా పదోన్నతి ● జిల్లా డీఐఈవోగా సుబ్బారావు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్ఐఓ(ఎఫ్ఏసీ), డీకే ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆదూరు శ్రీనివాసులు బదిలీ అయ్యారు. చిత్తూరు డీఐఈఓగా పదోన్నతి కల్పించి కడప ఆర్జేడీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. డీకేడబ్ల్యూలో 2021 నుంచి ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులు 2023 జూన్ 14 నుంచి ఆర్ఐఓగా అదనపు బాధ్యతలు చేపట్టారు. నాటి నుంచి ఇంటర్ విద్యా వ్యవస్థలో పలు సంస్కరణలు చేపట్టడంతోపాటు పరీక్షలను కూడా విజయవంతంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో గతంలో ఉన్న జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి (డీవీఈఓ)ల పోస్టులను మార్పు చేస్తూ నూతనంగా డీఐఈఓగా మార్పు చేస్తూ పలువురికి పదోన్నతులు కల్పించి కొత్త పోస్టింగ్‌లు ఇచ్చారు. పదోన్నతుల్లో భాగంగా జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీఐఈఓ)గా వీవీ.సుబ్బారావు నియమితులయ్యారు. బాపట్ల జిల్లా అద్దంకి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, జోన్-3 ఆర్జేడీ(ఎఫ్ఏసీ)గా, పరీక్షల నియంత్రణ అధికారి(ఎఫ్ఏసీ)గా పనిచేస్తున్న వీవీ.సుబ్బారావుకు పదోన్నతి కల్పించి, నెల్లూరు డీవీఈఓగా బదిలీ చేశారు. డీఐఈఓగా ఆయన పూర్తిస్థాయి బాధ్యతలు నిర్వహిస్తూనే ఇంటర్‌బోర్డు పరీక్షల నియంత్రణ అధికారి (ఎఫ్ఏసీ)గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ప్రస్తుతం జిల్లాలో డీవీఈఓ(ఎఫ్ఏసీ)గా పనిచేస్తున్న మధుబాబును తిరిగి ఇనమడుగు ప్రిన్సిపాల్‌గా వెనక్కు పంపించారు. ఆర్ఐఓగా మాత్రం ఎవరినీ నియమించలేదు. పదోన్నతుల పొంది బదిలీ అయిన అధికారులంతా వెంటనే విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



జిల్లా నూతన డీఐఈవో సుబ్బారావు

గ్రావెల్ మాఫియాకు చెక్!

● గ్రామస్థుల ఫిర్యాదుతో రంగంలోకి ఎమ్మెల్యే ● నేరుగా తవ్వకాల ప్రాంతానికి కాకర్ల

● వాహనాల సీజ్.. అధికారుల తీరుపై ఆగ్రహం

● ఉదయగిరిని వీడాలని మాఫియాకు హెచ్చరిక

ఆయన ఓ ఎమ్మెల్యే. తమ గ్రామంలో అక్రమంగా గ్రావెల్ తరలించి కొండను పిండి చేస్తున్నారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. అంతే, బిజీ షెడ్యూల్ ఉన్నా.. ఎవరికీ చెప్పకుండా గ్రావెల్ తవ్వుతున్న ప్రాంతానికి చేరుకున్నారు. అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న వాహనాలను వెంబండించి అనంతరం అధికారులకు ఫోన్ చేసి సీజ్ చేయించిన ఘటన వింజమూరు మండలం నల్లగొండ్ల గ్రామంలో సోమవారం చోటుచేసుకొంది.

- వివరాలు 8లో..



నల్లగొండలో గ్రావెల్ తవ్వకాలను అడ్డుకుంటున్న ఎమ్మెల్యే కాకార్ల సురేష్

పశువులకు కష్టకాలం!

అధిక ఉష్ణోగ్రతలతో ఇబ్బందే ● పాల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం

వేసవి వచ్చిందంటే పాడిపరిశ్రమపై తీవ్ర ప్రభావం పడుతోంది. అధిక ఉష్ణోగ్రతలు, వేడిగాలులతో పశువులు తీవ్ర ఒత్తిడికి గురవుతాయి. అంతేకాక సరైన ఆహారం, నీరు అందక పశువుల ఆరోగ్యం దెబ్బతింటుంది. అధిక వేడి కారణంగా పశువుల శరీర ఉష్ణోగ్రతలు పెరగడంతో తీవ్ర అసౌకర్యానికి గురై తద్వారా పాల దిగుబడి తగ్గుతుంది. ఈ సీజన్‌లో దాదాపు 30శాతం మేర పాల దిగుబడులు తగ్గుతున్నాయని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే కొన్ని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటే పాల ఉత్పత్తి మెరుగు పడే అవకాశాలు ఉన్నాయని, రైతులు వాటిని పాటించి పాల ఉత్పత్తి తగ్గకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు.

జిల్లాలో 6,46,088 నల్ల పశువులు, 57,774 తెల్ల పశువులు ఉన్నాయి. వీటిలో దాదాపు పాలు ఇచ్చేవి 5,96,393 నల్ల పశువులు, 47,131 తెల్ల పశువులు మాత్రమే. సాధారణ పరిస్థితుల్లో తెల్ల పశువులు సరాసరి 5 నుంచి 7లీటర్ల వరకు, నల్ల పశువుల నుంచి 5 నుంచి 10లీటర్ల వరకు పాల ఉత్పత్తి ఉంటుంది. ఈక్రమంలో జిల్లాలో ఒక్కరోజులో సరాసరి పాల దిగుబడి 25.34 లక్షల లీటర్లని పశుసంవర్ధక శాఖ అంచనా. అయితే వేసవిలో తీవ్రమైన ఎండతోపాటు వడగాల కారణంగా పాలఉత్పత్తి తగ్గిపోతుంది. ఒక్కో పశువు అనుకూల వాతావరణంలో ఇచ్చే పాలఉత్పత్తి కంటే లీటరు నుంచి 2లీటర్ల వరకు తగ్గుతున్నాయని రైతులు చెబుతున్నారు. అయితే వేసవిలో సహజంగానే 30 శాతం వరకు పాల ఉత్పత్తి తగ్గుతుందని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన ఒక్క రోజులో వచ్చే పాల దిగుబడితో పోలిస్తే సుమారు 7.6 లక్షల లీటర్ల వరకు ఉత్పత్తి తగ్గుతోంది. ఒక లీటరు పాలు సరాసరిన రూ.60 నుంచి రూ.90 వరకు బహిరంగ మార్కెట్‌లో ధర పలుకుతోంది.

● ఎదకొచ్చే సమయం...

పశువులు ఎక్కువగా వేసవిలోనే ఎదకు వస్తాయి. ఎండ దెబ్బ తగిలితే చూలు నిలవదని జాగ్రత్తగా ఉండాలని పశువైద్యులు సూచిస్తున్నారు. అంతేగాక పాల ఉత్పత్తి కూడా తగ్గుతుందని చెబుతున్నారు. అధిక పాల ఉత్పత్తి ఇచ్చే సంకర జాతి పశువులు అధిక ఉష్ణోగ్రతల కారణంగా తీవ్ర ఒత్తిడికి గురవుతాయి. దీంతో పాల ఉత్పత్తి తగ్గుతుంది. ఈ సమయంలో పశువులకు రక్షణ కల్పిస్తూ తగినంత నీరు అందుబాటులో ఉంచాలి. అదేవిధంగా పశుగ్రాసం కొరత లేకుండా చూసుకోవాలని ముఖ్యంగా పచ్చిమేత అందుబాటులో ఉంచుకోవాలని వైద్యులు తెలియజేశారు.

● పాలు పితికే సమయం

వేసవిలో ఉదయం ఉష్ణోగ్రతలు పెరగక ముందు, సాయంత్రం ఉష్ణోగ్రతలు తగ్గిన తరువాత పాలు పితకడం వల్ల పశువుల నుంచి ఎక్కువ పాల ఉత్పత్తి పొందవచ్చు. అధిక ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం కోసం ఖనిజ లవణ మిశ్రమాన్ని 30 నుంచి 50గ్రాముల దాణాలో ఇవ్వాలి. ఖనిజ లవణ మిశ్రమాల దిమ్మెలను పశువుల కొట్టాల్లో అందుబాటులో ఉంచాలి. గడ్డిని ముక్కలుగా కోసి వేయడం వల్ల త్వరగా జీర్ణమవుతాయి. అదేవిధంగా పశువులకు రాత్రి పూట మేతను వేయడం వల్ల ఎక్కువ తింటాయి. పగలు నెమరు వేసుకునేందుకు అవకాశం ఉంటుంది. తద్వారా పగటి వేడిని తట్టుకోగలవు.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)





ముక్కలుగా కత్తిరించిన పచ్చిగడ్డి మేలు

పగలు పచ్చిగడ్డి, రాత్రి ఎండుగడ్డి



సాధారణ రోజుల్లో పశువులకు ప్రత్యేక జాగ్రత్తలు అవసరం లేదు. కానీ వేసవిలో మాత్రం పరిస్థితులు చాలా మారిపోతాయి. పగలంతా చెట్ల కింద బాగా గాలి తగిలే ప్రాంతంలో ఉంచుతాను. రాత్రి షెడ్లకు దోమతెరలు, ఫ్యాన్లు ఏర్పాటు చేస్తాను. పగలు పచ్చిగడ్డి, రాత్రిపూట ఎండుగడ్డి వేస్తున్నాను. ముక్కలుగా కోసి వేయడం వల్ల పశువులకు త్వరగా జీర్ణమవుతుంది. ప్రతిరోజూ దాణా తప్పనిసరి. ఇన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా 10లీటర్లు పాలిచ్చే పశువు నుంచి దాదాపుగా లీటరు నుంచి ఒకటిన్నర లీటరు వరకు తగ్గుతోంది.

- కొప్పోలు దేవదాసు, లేబూరు, ఇందుకూరుపేట

ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి



వేసవిలో అధిక ఉష్ణోగ్రతలకు పశువులు తీవ్ర ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంది. జీర్ణశక్తి, నీటి వినియోగం మారడం వల్ల సాధారణ కాలం కంటే పాల ఉత్పత్తి తక్కువగా ఉంటుంది. కొన్ని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం వల్ల పాల ఉత్పత్తి తగ్గకుండా చూసుకునే అవకాశం ఉంది. ఉదయం 10గంటలలోపు సాయంత్రం 5గంటల తరువాత పశువులను మేతకు వదలడం మంచిది. అదేవిధంగా షెడ్ల చుట్టూ గోనె సంచులు కట్టి చల్లని నీటితో తడుపుతూ ఉండాలి. సంకరజాతి పశువుల షెడ్లలో తప్పనిసరిగా ఫ్యాన్లు ఉంచాలి. షెడ్లలో వాతావరణం చల్లగా ఉండేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి. పశువులకు తగినంత నీరు, నాణ్యమైన పశుగ్రాసం అందించడం ఎంతో ముఖ్యం. వీటివల్ల పాల ఉత్పత్తి పెరిగే అవకాశం ఉంటుంది. పశువైద్యులు కూడా రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందించేలా చూడాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. క్షేత్రస్థాయిలో అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

- రమేష్ నాయక్, పశుసంవర్ధక శాఖ జేడీ

ఎవరేమన్నా మా తీరు మాదే!

● సమస్యల వలయంలో పెద్దాసుపత్రి ● కలెక్టర్ సూచనలు పాటించని అధికారులు

● నాలుగు నెలలైనా ఎక్కడ పనులు అక్కడే.. ● నేడు జీజీహెచ్ అభివృద్ధిపై సమీక్ష

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : పేదల ఆరోగ్య వరప్రసాదిని, జిల్లాకే తలమానికమైన నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలను (జీజీహెచ్) సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. వీటి పరిష్కారానికి కలెక్టర్ పలు సూచనలు చేసి నాలుగు నెలలు పూర్తయినా, నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఈ క్రమంలో మంగళవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరగనుంది. ఈసారైనా ఆ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందా అని అటు రోగులు, ఇటు వైద్య సిబ్బంది ఆశగా ఎదురుచూస్తున్నారు.

గతేడాది డిసెంబరు 18న జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. 15 రోజుల్లో మార్పు రావాలని కలెక్టర్ ఆనంద్ సూచించినా ఆ మార్పు రాలేదు. ముఖ్యంగా ఆరోగ్యశ్రీ నిధులు రూ. 2 కోట్లు ఆసుపత్రి అభివృద్ధికి వాడుకోవాలన్నా ఇప్పటికీ అతీగతీలేదు. వైద్యులు సమయపాలనపై అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నట్లు తెలుస్తోంది. ఆసుపత్రిలో 750 పడకలు ఉన్నా రోగులకు అందిస్తున్న సేవలపై వైద్యులు, సిబ్బంది తీరును పలువురు ప్రశ్నిస్తున్నారు. ఫిజియోథెరపీ విభాగంలో అవసరమైన పరికరాలు లేనందున రోగులను వెంకటాచలంలోని కేంద్ర ప్రభుత్వ కాంపోజిట్ రీజనల్ సెంటర్(సీఆర్‌సీ) సెంటర్‌కు పంపించాలన్నారు. ప్రతి రోగి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని గత సమావేశంలో నిర్ణయించారు. అయితే వాటిని పాటించే విధానంలో ఇంకా నిర్లక్ష్యం తాండవిస్తోంది. ఆసుపత్రిలో ఏసీలు ఉన్నా సక్రమంగా పనిచేయటం లేదు. ఇక లిఫ్ట్‌ల పరిస్థితీ అంతే. ఆయా సమస్యల పరిష్కారంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఆశించిన స్థాయిలో ప్రగతి సాధించలేదన్న విమర్శలు లేక పోలేదు. ఈ నేపథ్యంలో మంగళారం జరిగే ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్ ఏ నిర్ణయం తీసుకోనున్నారో వేచి చూడాల్సిందే.



పథకాలు అందుతున్నాయా?

● ఇంకా ఏమైనా మార్పు, చేర్పులు చేయాలా!?

● పాడిరైతుల నుంచి వివరాల సేకరణ

● 40 ప్రశ్నలతో ఆన్‌లైన్ సర్వే ప్రారంభం

● పాడిపరిశ్రమ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి

నెల్లూరు (వ్యవసాయం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : 'ప్రభుత్వం నుంచి పాడి రైతులు ఏం కోరుకుంటున్నారు? ఏమేరకు వారికి పథకాలు ఉపయోగపడుతున్నాయి.. పథకాల్లో ఏవైనా మార్పులు చేయాల్సి ఉందా!? ఎంతమంది ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటున్నారు!? వంటి సమచారాన్ని రైతుల నుంచి సేకరించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సోమవారం ఆన్‌లైన్ సర్వే ప్రారంభమైంది. ఒక్కో మండలానికి ఐదుగురు ఎన్యుమరేటర్లను నియమించి, సర్వే ఎలా చేయాలో శిక్షణ కూడా వారికి ఇచ్చారు. ఆయా మండలాల పశువైద్యుల పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా దాదాపు 7వేల మంది పాడిరైతులు, పొదుపు మహిళలు, వ్యవసాయ రైతులతో ఎన్యుమరేటర్లు చర్చించనున్నారు. ఒక్కో మండలంలో సుమారు 189 మందిని కలిసి ప్రభుత్వం అందించిన 40 ప్రశ్నలకు సమాధానాలు రాబట్టనున్నారు. 25వ తేదీ కల్లా సర్వే పూర్తి చేసి, ఆ వివరాలను జిల్లా ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదికను చేరవేయనున్నారు.



కొత్తూరులో రైతుల అభిప్రాయాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

ఆత్మకూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి మంగళవారం ఉదయం 11-30 నుంచి మధ్యాహ్నం 1-30 గంటల వరకు స్థానిక విద్యుత్‌శాఖ డివిజనల్ కార్యాలయం ఆవరణలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆత్మకూరు, ఉదయగిరి, కలిగిరి సబ్ డివిజన్ పరిధిలోని సెక్షన్లకు సంబంధించి విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను తెలియపరిచి పరిష్కరించుకోవాలని కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9285
వెండి కిలో ధర	రూ. 98,800
వెండి ఒక గ్రాము	రూ.101.60

సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తిచేస్తాం

● రమణయ్య, ఏఈ



సంగం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నట్లు పంచాయతీరాజ్ ఏఈ పి రమణయ్య తెలిపారు.

? ఎన్ని సిమెంట్ రోడ్లకు ఎన్నికోట్ల నిధులు మంజూరయ్యాయి.

! మండలంలోని 20 పంచాయతీల్లో 30 గ్రామాల్లో 76 సిమెంట్ రోడ్లకు మొదటి విడత రూ. 2 కోట్లు, రెండవ విడత రూ. 2.5 కోట్లు, మొత్తం రూ. 4.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి.

? ఎన్ని రోడ్ల నిర్మాణం పూర్తయింది. మిగిలిన పనుల పరిస్థితి ఏమిటీ.

! మొదటి విడత ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ. 2 కోట్లకు సంబంధించి 36 పనులు పూర్తయ్యాయి. రెండవ విడతలో మంజూరైన 40 పనులకు గాను సగం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు ఈనెలాఖరుకు పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నాం.

? నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయా.

! నిబంధనలకు అనుగుణంగా సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ల పర్యవేక్షణలో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. నాణ్యత లోపిస్తే బిల్లులు నిలిపివేస్తామని హెచ్చరించాం.

న్యూస్ బాక్స్

రాములోరికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో సీతారాములు

ఉదయగిరి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సుద్దబావి వీధిలో ఉన్న కోదండ రామస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామ నవమి సందర్భంగా స్వామివార్ల కల్యాణోత్సవం నిర్వహించి 16 రోజులైన సందర్భంగా సీతారామచంద్ర స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారికి కాయాకర్పూరం అందజేసి తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలకు సీతమ్మతల్లి సారెగా పసుపు, కుంకుమ, తాంబూలం పంచిపెట్టారు.

పాఠశాల తనిఖీ

ఉదయగిరి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఎంఈవో-2 తోట శ్రీనివాసులు తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తరగతులు పూర్తయిన విద్యార్థులను పైతరగతులకు ప్రమోట్ చేసి ఆయా తరగతి గదుల్లో ప్రవేశం కల్పించి వారిచే గేయాలు, పద్యాలు పాడించాలన్నారు. వేసవిలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

రైతులకు వ్యవసాయ పనిముట్ల పంపిణీ

అనంతసాగరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఉత్తర కాలువ చైర్మన్ మెట్టుకూరు కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం అనంతసాగరంలోని వ్యవసాయ కార్యాలయ ఆవరణలో తహసీల్దారు సుభాషిణి ఆధ్వర్యంలో ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ద్వారా అందించిన వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో శ్రీధర్‌రెడ్డి, టీడీపీ అధ్యక్షురాలు సునీత, చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, ఖాసీంబాష తదితరులు పాల్గొన్నారు.

మృత్యు కుహరంలా సంగం - కలిగిరి రహదారి

● ప్రమాదకరంగా ఆశ్రమం మలుపు ● ప్రమాదాల బారిన వాహనదారులు ● పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



సంగం - కలిగిరి రహదారిలో ప్రమాదకర మలుపు



మలుపులో జరిగిన ప్రమాదంలో దగ్ధమైన కారు (ఫైల్)

సంగం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సంగం - కలిగిరి రహదారి మృత్యు కుహరంగా మారింది. ప్రమాదకరంగా ఉన్న మలుపులో నిత్యం వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో ఆ రహదారి అంటేనే హడలిపోతున్నారు. సంగం - ముంబయి జాతీయ రహదారి కూడలి నుంచి కలిగిరి రహదారి ప్రారంభమవుతుంది. ఇది రెండు వరుసల రహదారి. సంగం కూడలి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఆశ్రమం వద్ద ప్రమాదకరంగా మలుపు ఉంది. కలిగిరి రహదారి వైపు నుంచి వచ్చే వాహనాలే ప్రమాదాలకు గురవుతాయి. ఈ రహదారి హసనాపురం నుంచి మలుపు వరకు సుమారు 8 కిలోమీటర్ల దూరం రోడ్డు నేరుగా ఉంటుంది. దీంతో అటువైపు నుంచి వచ్చే వాహనాలు మలుపు వరకు అతివేగంగా వస్తాయి. మలుపు దగ్గరకు వచ్చే సరికి వాహనాలు అదుపు తప్పి కాంక్రీట్ కల్వర్టును ఢీకొని సుమారు పది అడుగుల మేర ఉన్న లోయలో పడి ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ మలుపులో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారింది.

స్పీడ్‌బ్రేకర్ల తొలగింపుతోనే ప్రమాదాలు

ప్రమాదాల నివారణకు గతంలో మలుపునకు ఉత్తరం వైపు ఆర్ అండ్ బీ అధికారులు స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. స్పీడ్ బ్రేకర్ల కారణంగా వేగంగా వచ్చే వాహనాలు మలుపు వద్దకు వచ్చేసరికి స్లో అయ్యేవి. దీంతో చాలా వరకు ప్రమాదాలు తగ్గాయి. అయితే 2022లో కలిగిరి రహదారిలో జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు సంగం బ్యారేజ్ ప్రారంభానికి వచ్చినప్పుడు కలిగిరి రహదారిలో మలుపునకు అవతల వైపు ఉన్న లేఅవుట్‌లో సీఎం బహిరంగ సభ వేదిక ఏర్పాటు చేశారు. దీంతో అధ్వానంగా ఉన్న రహదారికి సీఎం రాకతో మరమ్మతుల పేరుతో రోడ్డు వేశారు. ఈక్రమంలో అప్పటి వరకు మలుపు సమీపంలో ఉన్న స్పీడ్ బ్రేకర్లు తొలగించారు. సూచిక బోర్డులు ఉన్నా ఈ రహదారిలో తొలిసారి ప్రయాణించే వాహనదారులు వాటిని గమనించకుండా వేగంగా వస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

చోద్యం చూస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

కలిగిరి రహదారిలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నా ఆర్ అండ్ బి అధికారులు చోద్యం చూస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రహదారి పొడవునా మార్జిన్‌లో ముళ్ల కంపలు ఏపుగా పెరిగి రోడ్డు మీదకు వచ్చి ఉన్నాయి. అయినా పట్టించుకోవడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న కలిగిరి రహదారి మలుపు సమీపంలో స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వ్యవసాయ భూములను పరిశ్రమలకు కేటాయించొద్దు



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

దుత్తలూరు (ఉదయగిరి), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు రెవెన్యూ పరిధిలోని కాలనీ సమీపంలోని వ్యవసాయ భూములను పరిశ్రమలకు కేటాయించవద్దని సోమవారం తహసీల్దారు వై నాగరాజుకు కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ దశాబ్దాల క్రితం తాము ఆ భూములు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. 50 ఎకరాల భూములను ఏపీఐఐసీకి కేటాయించాలని నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని తహసీల్దారు హామీ ఇచ్చారు.

కాలువ పూడ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

అనంతసాగరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనగలూరు వద్ద ఉత్తర కాలువ ఉప కాలువను గ్రామానికి చెందిన సంటయ్య అనే వ్యక్తి పూడ్చేయడంతో కొంతకాలంగా పొలం బీడుగా పెట్టుకొంటున్నట్లు బాధిత రైతులు వాపోయారు. స్పందనలో సోమవారం తహసీల్దారు సుభాషిణికి వినతిపత్రం ఇచ్చి కాలువ పూడ్చిన వ్యక్తిపై చర్యలు తీసుకొని కాలువ పారుదల జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సాగరం చెరువు నీటి సంఘం అధ్యక్షుడు రాపూరు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

సీతారామపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసినేనిపల్లి, దేవమ్మచెరువు, అయ్యవారిపల్లి సచివాలయాలు, హౌసింగ్, ఎంపీడీవో కార్యాలయాలను సోమవారం డిఎల్‌డిఓ టి రమణయ్య తనిఖీచేశారు. ఆయన మాట్లాడుతూ గృహ లబ్ధిదారులు త్వరగా నిర్మించుకునేలా చూడాలన్నారు. ఆధార్ లేని ఎస్టీలకు ఆధార్ చేయించి వారికి పథకాలు అందేలా చూడాలని తెలిపారు. సకాలంలో సర్వేలన్నీ పూర్తిచేయాలని తెలిపారు.

పీఎస్ రోడ్డుపై ట్రాఫిక్ సర్వే

కలువాయి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పొదలకూరు- సోమశిల రోడ్డుపై ట్రాఫిక్‌ను రెండు రోజులుగా ఓ ప్రైవేటు ఏజెన్సీ వారు సర్వే చేస్తున్నారు. జాతీయ రహదారులు మాదిరిగా స్టేట్ హైవే రోడ్లు కూడా బీవోటీ విధానంలో ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించి నాలుగు లైన్లు రోడ్లుగా అభివృద్ధి చేసి టోల్‌గేట్లు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం స్టేట్ హైవే రోడ్ల సర్వే నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నెల్లూరు నుంచి సోమశిల వరకు సర్వే చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సోమశిలలో 51.666 టీఎంసీల నీరు

అనంతసాగరం, ఏప్రిల్ 21 ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా సోమవారానికి 51.666 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 200, దక్షిణ కాలువకు 50, డెల్టాకు 1,000 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

టీబీ నిర్ధారణ పరీక్షలు

సంగం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో మండలంలో టీబీ, లెప్రసీ వ్యాధిగ్రస్థుల కుటుంబ సభ్యులకు వ్యాధి ఉందో, లేదో తెలుసుకునేందుకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి, సూపర్‌వైజర్స్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలి : సీపీఎం



పెరిగిన విద్యుత్ బిల్లులను చూపిస్తూ నిరసన వ్యక్తంచేస్తున్న సీపీఎం నాయకులు, గ్రామస్థులు

సీతారామపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పెరిగిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని సీపీఎం ఉదయగిరి ప్రాంతీయ కమిటీ కార్యదర్శి కోడె రమణయ్య తెలిపారు. సోమవారం పడమటి రొంపిదొడ్ల గ్రామంలో గ్రామస్థులతో కలిసి పెరిగిన విద్యుత్ బిల్లులను చూపిస్తూ నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువులు, గ్యాస్ ధరలు పెరగడంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలపై మరింత భారం మోపడం సరికాదని, ప్రభుత్వం వెంటనే విద్యుత్ చార్జీలు తగ్గించాలని, లేకపోతే ప్రజలతో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రమణరెడ్డి, బ్రహ్మారెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జడ్పీటీసీ సభ్యుడు రావిళ్ల నాగేంద్ర కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గవదకట్ల వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన నిర్వహించిన మండల సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి కృషిచేస్తున్నారని, ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయనకు అండగా నిలవాలని కోరారు. ప్రతి సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు డుమ్మా కొడుతుండడంతో సమస్యలను పరిష్కరించుకొనే అవకాశం లేకుండా పోతోందని వైస్ ఎంపీపీ దేవనబోయిన మధు, సర్పంచు దిలీప్‌కుమార్ మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, ఎంఈవో రమణయ్య, డిప్యూటీ ఎంపీడీవో నాగూర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి



పోస్టర్ చూపిస్తూ సూచనలు ఇస్తున్న సీడీపీవో పద్మావతి

అనంతసాగరం ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని అనంతసాగరం సీడీపీవో పద్మావతి సూచించారు. సోమవారం సంజీవ నగరంలోని అంగన్‌వాడీ కేంద్రంలో వారితో ప్రత్యేక సమావేశం నిర్వహించి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే ఆహారంలో ఉండే పోషక విలువలను తెలిపారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ శారదమ్మ, కర్యకర్తలు పాల్గొన్నారు.

● దుత్తలూరు(ఉదయగిరి): తల్లీబిడ్డ సంక్షేమమే పోషణ పక్వాడ్ లక్ష్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ షాను పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మందాలపల్లి మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ్ మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిం చారు. బరువు తక్కువగా ఉన్న చిరుదాన్యాలు, బాలామృతం క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రాధా, ప్రసన్న, వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణపై అవగాహన అవసరం

సీతారామపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైతుసేవా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం గ్రామ వ్యవసాయ సహాయకులకు భూసార పరీక్షలు, మట్టి నమూనాల సేకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలతో నేలలో నత్రజని, భాస్వరం, పొటాష్ ఎంతమేర లభ్యం అవుతుందో రైతులు తెలుసుకోవచ్చునని, సూక్ష్మపోషకాలు ఎంత మేరకు నేలలో ఉన్నాయో తెలుసుకొని వాటికి అనుగుణంగా ఎరువుల యాజమాన్యం పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సాంబశివయ్య, విఏఏలు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



పాఠశాలలో చేరిన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిం చాలంటూ సోమవారం పెద్దిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయ బృందం గ్రామాల్లో పర్యటించి తల్లిదండ్రులను కోరారు. ప్రధానోపాధ్యాయుడు చలపతి ఆధ్వర్యంలో గ్రామంతో పాటు తోటల చెరువు పల్లి, ధర్మవరం గ్రామాల్లో విద్యార్థుల నివాసాలకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న విద్యా విధానంపై అవగాహన కల్పించారు. ఉచితంగా పౌష్టికాహారం, యూనిఫాం, పుస్తకాలు, నోట్బులు అందజేయడం జరుగుతందన్నారు. అనంతరం విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రావిళ్ల నాగార్జున, శ్రీహరి, జలీల్ సుల్తాన్, చిన్నరామయ్య, సుబ్రమణ్యం, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

స్థానిక ఉన్నత పాఠశాలలో సోమవారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో రమణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యతో పాటు క్రమశిక్షణకు ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్నారు. అనంతరం పాఠశాల అభివృద్ధిలో భాగంగా భోజనశాల ఏర్పాటుకు సహకారం అందించిన తెలుగు ఉపాధ్యాయిని కె సుభద్ర దంపతులను ఘనంగా సన్మానించారు. అలాగే ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక, కాకొల్లువారిపల్లి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు డీ వీరభద్రయ్య, పీ బాలభాస్కర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రూ.3 కోట్లకు కుచ్చు టోపీ!?

● బోర్డు తిప్పేసిన ఔషధ దుకాణం నిర్వాహకులు
● పరారీలో ఒకరు

కావలి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఇద్దరు వ్యక్తులు కలసి మెడికల్ షాపు ఏర్పాటు చేసి వ్యాపారం ప్రారంభించారు. అందినకాడికి అప్పులు చేసి జనాలకు సుమారు రూ.3 కోట్లకు కుచ్చు టోపీ పెట్టి బోర్డు తిప్పేశారు. డబ్బుల లావాదేవీలతో సంబంధం ఉన్న ఆ ఇద్దరిలో ఒకరు పరారు కాగా తనకెలాంటి సంబంధం లేదని, తనను కూడా ఆ వ్యక్తి మోసం చేశాడంటూ మరో వ్యక్తి స్థానికంగా తప్పించుకు తిరుగుతున్నాడు. ప్రజల నుంచి అప్పులు తెచ్చి వ్యాపారాలు చేస్తారు. కాలం కలిసి వచ్చి ఆదాయాలు వస్తే తెచ్చిన వారికి ఇస్తారు. ఒకవేళ ఆదాయాలు రాక పోయినా నష్టాల బారిన పడక ముందే తమ కుటుంబ పోషణ అవసరాల మేరకు తెచ్చిన డబ్బులు భద్ర పరుచుకుని బోర్డులు తిప్పేసి ప్రజలకు కుచ్చు టోపీలు పెడతారు. ఇలా పలు వ్యాపార సంస్థలు చేస్తున్న మోసాలు అప్పుడప్పుడు ఇంటుంటుం. అయితే పోలీసులకు ఫిర్యాదులు చేస్తే కేసులు తప్ప వచ్చేతులమో పణమో కూడా రాదనే భయంతో ఎవరికి వారు మదనపడుతుంటారు. ప్రస్తుతం కావలిలో అలాంటి ఘటనే ఇప్పుడు వెలుగు చూసింది. వివరాల మేరకు.. కావలి పట్టణం ట్రంకురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం సమీపంలో ఇద్దరు వ్యక్తులు కలిసి మెడికల్ షాపు పెట్టుకుని వ్యాపారం చేస్తున్నారు. వారు ఆ ఒక్క వ్యాపారమే కాకుండా కొంత కాలం డాబా హోటల్, కారులు కొని అద్దెలకు నడపడం, తదితర వ్యాపారాలు చేశారు. అయితే ఏమి జరిగిందో గానీ వారంరోజులుగా మందుల దుకాణం మూసివేశారు. దీంతో వారికి అప్పులు ఇచ్చిన వారు ఆందోళన చెందుతుండడంతో అసలు విషయం వెలుగు చూసింది. 50మంది నుంచి రూ.3కోట్ల వివిధ రకాలుగా వసూలు చేసినట్లు తెలుస్తోంది. పలు మెడికల్ ఏజెన్సీల వద్ద భారీగా మందులు తెచ్చుకుని బిల్లులు చెల్లించలేదని, పలువురి చిట్ నిర్వాహకుల వద్ద చిట్స్ వేసి పాడుకుని నెలవారీ పేమెంట్లు కట్టలేదని బాధితులు వాపోతున్నారు. బాధితుల్లో ఎక్కువ మంది మెడికల్ ఏజెన్సీల వారు ఉండటంతో వారు మెడికల్ వ్యాపారుల అసోసియేషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. అయితే పలు వ్యాపారాలు చేసిన వీరికి ఎక్కడ నష్టాలు వచ్చాయో.. లేక నష్టాలు వస్తాయనే భయం వేసిందో ఏమో కానీ మొత్తం మీద అప్పు ఇచ్చిన వారికి డబ్బులు ఇవ్వకుండా వారం రోజుల క్రితం దుకాణం మూసి వేశారు. వారిద్దరిలో ప్రధానంగా అప్పులు తెచ్చిన వ్యక్తి ఎవరికీ కని పించకుండా ఫోన్‌లు ఎత్తకుండా పరారైనట్లు బాధితులు చెబుతున్నారు.

కర్రోడవాగు కాలువలో మహిళ మృతదేహం

- గుర్తించిన గొలగమూడి గ్రామస్థులు
- 3రోజుల కిందటే మృతిచెంది ఉండొచ్చనే అనుమానం
- ఫిబ్రవరి 20న మరో మహిళ మృతదేహం
- పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్న స్థానికులు

వెంకటాచలం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గొలగమూడి సమీపంలోని కర్రోడ వాగు కాలువలో సుమారు 45ఏళ్ల గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని సోమవారం స్థానికులు గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందివ్వడంతో వారు ఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహం ఉబ్బిపోయి దుర్వాసన వస్తుండటంతో మూడు రోజుల కిందట చనిపోయి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గత ఫిబ్రవరి 20న సుమారు 35ఏళ్ల గుర్తుతెలియని మహిళ మృతదే హం కొట్టుకవచ్చింది. అదికూడా సర్వేపల్లి కాలువ నుంచి రిజర్వాయర్‌లోకి చేరుకుంది. పోలీసులు అతి కష్టం మీద మార్చి 3న బయటకు వెలికి తీయించారు. అది మరవక ముందే ఇప్పుడేమో ఇపుడిలా జరడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఇద్దరూ మహిళలను ఎవరైనా కొట్టి చంపి కాలువలలో పడేశారా లేక మరేమైనా చేశారా అన్న అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెంట్రింగ్ మేస్త్రీ బలవన్మరణం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తాళలేక సెంట్రింగ్ మేస్త్రీ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు, నగరంలోని పొదలకూరురోడ్డు న్యూఎస్‌టీఐకాలనీలో ఆర్ముగం మురుగేషన్ వెంకటేష్(42), స్వాతి దంపతులు ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు. వెంకటేష్ సెంట్రింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలం కిందట రూ.లక్షల్లో అప్పులు చేసి సెంట్రింగ్ సామాన్లు కొనుగోలు చేశాడు. పనులు సరిగాలేక పోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో అప్పుల వారి నుంచి ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో కుంగిపోయాడు. ఆదివారం అర్థరాత్రి వరకు భార్యాపిల్లలతో గడిపారు. వారు నిద్రపోగానే పడకగదిలోకి వెళ్లి సీలింగ్ ఫ్యానుకు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం భార్య నిద్రలేచి, పిల్లలను లేపి పడకగది వద్దకు వెళ్లి తలుపులు తెరిచేందుకు ప్రయత్నించగా తెరుచుకోలేదు. లోపల గడియపెట్టి ఉండటంతో పిల్లలతోకలిసి బలంగా నెట్టడంతో తలుపులు తెరుచుకున్నాయి. భర్త ఉరివేసుకుని ఉండటాన్ని చూసి ఆయన్ను కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. ఈ మేరకు స్వాతి వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మత్యాలయ్య సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆకుతోట సమీపాన డాబా దగ్ధం



కాలిపోయిన డాబా పైకప్పు

నెల్లూరురూరల్, ఏప్రిల్ 21,(ఆంధ్రజ్యోతి): నెల్లూరు-ముత్తుకూరు మార్గంలోని నగరంలోని ఆకుతోట సమీపాన కొన్ని రోజులుగా మూతడపడిన డాబా ఆదివారం అర్థరాత్రి అగ్నికి ఆహుతైంది. ఈ డాబా వాడుకలో లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. కాగా మందుబాబులు, ఆకతాయిలు ఎవరైనా మద్యం సేవించి డాబా పైకప్పునకు నిప్పు పెట్టిఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపకదళం అధికారులు మంటలు ఆర్పారు. ఈఘటనపై సోమవారం రూరల్ పోలీసులు ఆరా తీశారు. ఆస్తి నష్టం ఎంత ఉంటుందనేది తెలియాల్సి ఉంది. ఈ ఘటనకు సంబంధించి ఎవరూ పోలీసులకు ఫిర్యాదు చేయలేదు.

● అగ్నికి ఇంట్లో వస్తువుల ఆహుతి

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : స్పష్టమైన కారణం తెలియదుకానీ నగరంలోని కంసాలివీధిలో కృష్ణచైతన్య ఇంటి కింద పోర్షన్‌లో సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. ఇంట్లో నుంచి దట్టమైన పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు సంతపేట పోలీసులకు సమాచారం అందించారు. వారు అగ్నిమాపక సిబ్బందికి తెలియజేశారు. ఏడీఎఫ్‌వో ఎస్ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఇంట్లోని వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఓ వృద్ధుడి అదృశ్యంపై నగరంలోని చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు తిరిసిపేటలో సురేష్ కుటుబం నివాసం ఉంటున్నది. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో ఇంట్లో వారికి భారం కాకూడదని భావించి ఆదివారం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు గాలించినా ప్రయోజనం లేకపోవడంతో సోమవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	100
స్కిన్ చికెన్	184
స్కిన్‌లెస్	204

కోడిగుడ్ల ధర (100): 420

» అద్దె భవనంలోకి బీసీ బాలుర వసతి గృహం
» ఇన్‌చార్జ్ వార్డెన్లే దిక్కు
» విద్యార్థులపై కొరవడిన పర్యవేక్షణ
» అవస్థల్లో బాలబాలికలు


లింగసముద్రంలోని బీసీ బాలికల వసతి గృహం

వసతి గృహాల్లో సమస్యల తిష్ఠ!


బీసీ బాలుర వసతి గృహం గదిలో ఊడిపడుతున్న శ్లాబు పెచ్చులు

లింగసముద్రం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన లింగసముద్రంలోని బీసీ బాలుర, బాలికల, ఎస్సీ బాలుర వసతి గృహాల్లో సమస్యలు తిష్ఠ వేశాయి. అన్ని హాస్టళ్లకు ఇన్‌చార్జి వార్డెన్లే విధులు నిర్వహిస్తుండడంతో విద్యార్థులపై పర్యవేక్షణ కొరవడింది. గత వైసీపీ ప్రభుత్వం వసతి గృహాల్లో మౌలిక వసతుల గురించి పట్టించుకోకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా శిథిలావస్థకు చేరిన బీసీ బాలుర వసతి గృహంలోని ప్రతి గదిలో శ్లాబు పెచ్చులూడి కింద పడడంతోపాటు ప్రతి గది వర్షానికి ఉరుస్తోంది. దీనిపై విద్యార్థులు ఆందోళన చెందడంతో ఇటీవల ఈ వసతి గృహాన్ని బీసీ సంక్షేమశాఖ అధికారులు స్థానిక బలిజపాలెంలోని అద్దె భవనంలోకి మార్చేందుకు చర్యలు చేపట్టారు. అయితే కేవలం సామగ్రిని మాత్రమే మార్చి విద్యార్థులు ఈనెల 23వ తేదీ వరకు పాత భవనంలోనే ఉంటారని, వేసవి శెలవుల అనంతరం జూన్ నెలలో విద్యా సంవత్సరం ఆరంభం నుంచి అద్దె భవనంలో ఉంటారని అధికారులు అంటున్నారు. అలాగే ఎస్సీ బాలుర వసతి గృహంలోనూ సమస్యలకు కొదువే లేదు. ఇక్కడ గదులకు తలుపులు, కిటికీలు లేవు. మరుగుదొడ్లు, బాతురూంలకు గతంలో నీటి వసతి కల్పించ లేదు. విద్యార్థులు మల, మూత్ర విసర్జనకు ఆరుబయటకు వెళుతున్నారు. ఫలితంగా అవి వినియోగించకనే శిథిలావస్థకు చేరాయి. అలాగే కొన్ని గదులు కూడా వర్షానికి ఉరుస్తుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బీసీ బాలికల వసతి గృహంలో కూడా సమస్యలు తిష్ఠ వేశాయి. ఈ వసతి గృహంలోనూ కొన్ని గదులు వర్షం వస్తే ఉరుస్తున్నాయి. కొన్ని గదుల్లో శ్లాబు పెచ్చులూడి పడుతున్నాయి. మరుగుదొడ్ల నుంచి నీరు బయటకు వెళ్లడం లేదు. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. అయితే ఈ వసతి గృహంలో ఏర్పడ్డ సమస్యలను పరిష్కరించేందుకు తాత్కాలికంగా మరమ్మతు పనులు చేయిస్తున్నారు.

● మూడు హాస్టళ్లకు ఇన్‌చార్జి వార్డెన్లే దిక్కు!

గత కొన్నేళ్ల నుంచి బీసీ బాలుర, బాలికల, ఎస్సీ బాలుర వసతి గృహాలకు ఇన్‌చార్జి వార్డెన్లే విధులు నిర్వహిస్తున్నారు. బీసీ బాలుర వసతి గృహానికి మండలంలోని పెదపవని బీసీ హాస్టల్ వార్డెన్, బీసీ బాలికల హాస్టల్‌కు కందుకూరులోని బీసీ బాలికల కళాశాల హాస్టల్ మ్యాట్రిన్ ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఎస్సీ బాలుర హాస్టల్‌కు గుడ్లూరులోని ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. వీరు వారానికి ఒకటి రెండు సార్లు చుట్టపు చూపుగా వచ్చి వెళుతున్నారు. దీంతో ఆయా హాస్టళ్ల బాలుర, బాలికలపై పర్యవేక్షణ కొరవడిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వచ్చే విద్యా సంవత్సరం ఆరంభంలోనైనా రెగ్యులర్ వార్డెన్లను నియమించాలని విద్యార్థిని, విద్యార్థుల తలిదండ్రులు కోరుతున్నారు.


శిథిలావస్థలో ఎస్సీ బాలుర వసతి గృహం బాతురూంలు, మరుగుదొడ్లు

ఎస్సీ బాలుర వసతి గృహం మరమ్మతులకు నిధుల మంజూరు

లింగసముద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో మరమ్మతులకు సాంఘిక సంక్షేమ శాఖ నుంచి రూ.8 లక్షలు మంజూరయ్యాయని కందుకూరు ఆర్‌అండ్‌బీ ఏఈ షేక్ మహమ్మద్ బాషా తెలిపారు. ఈ హాస్టల్‌లో చాలా ఏళ్ల నుంచి బాతురూంలు, మరుగుదొడ్లకు నీటి వసతి లేక నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరాయి. అంతేకాక గదులకు కిటికీ రెక్కలు, తలుపులు లేక పోవడం. మంచినీటి పైపులు లేక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వసతి గృహం ప్రహరీ ఇనుప గేటు విరిగి పోవడంతో వసతి గృహంలోకి పందులు, కుక్కలు సంచరిస్తున్నాయి. వీటన్నింటిని కొత్తవి ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. ఇవి కాక విద్యార్థులు స్నానాలు చేసే చోట కుళాయిల ఏర్పాటు, వర్షానికి తడవకుండా పందిరి ఏర్పాటు, సింటెక్స్ మంచినీటి ట్యాంకులు ఏర్పాటు, చదువుకొనే చోట ప్లాటుఫారం, లైట్లు ఏర్పాటు చేస్తారని, అలాగే అవసరమైన చోట విద్యుత్ వైరింగ్ చేయిస్తామని చెప్పారు. ఈ పనులు రెండు మూడు రోజులలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

డ్రైనేజీ కాలువ నిర్మాణానికి శంకుస్థాపన


డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 25వ వార్డు గాయత్రీనగర్‌లో రూ.10 లక్షలతో నిర్మించ తలపెట్టిన డ్రైనేజీ కాలువకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు నాణ్యతా ప్రమాణాలతో చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ గణపతి, మున్సిపల్ మాజీవైస్ ఛైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, నాయకులు దామా మల్లేశ్వరరావు, గుర్రం మాల్యాద్రి, కంద్రా మాల్యాద్రి, పెంట్రాల సుబ్బారావు, పొడపాటి నాగేశ్వరరావు, గుర్రం మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయాలి

● కందుకూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో రజని


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రజని

కందుకూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి సకాలంలో టీకాలు వేయాల్సిన బాధ్యత వైద్యాధికారులు, సిబ్బందిపై ఉందని కందుకూరు డివిజన్ ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టరు రజని సూచించారు. పట్టణంలోని నక్షత్ర ఐటీ జేఈఈ అకాడమీ క్యాంపస్‌లో పట్టణంలోని రెండు పీహెచ్‌సీలు, మాచవరం పీహెచ్‌సీ పరిధిలోని వైద్యాధికారులు, సిబ్బందికి సోమవారం హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం, రీప్రొడక్టివ్ చైల్డ్ హెల్త్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టరు రమేష్, డాక్టరు రాకేష్, సీహెచ్‌వో శ్రీనివాసులు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీల స్వయం ఉపాధికి 26 యూనిట్ల మంజూరు

కావలి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ నిరుద్యోగులకు స్వయం ఉపాధి పథకం కింద 2025-26 సంవత్సరానికి కావలి పురపాలక సంఘం పరిధిలో రూ.107.50 లక్షలతో 26 యూనిట్లు మంజూరైనట్లు కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కావలి పురపాలకసంఘ పరిధిలో ఆసక్తికల షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారు ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇందుకు మే నెల 10వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు. దీనిపై ఏమైనా సందేహాలు ఉంటే సచివాలయాల్లో, మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

గర్భిణుల ఇళ్లకు వెళ్లి పోషకాహారం అందించాలి

కందుకూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కార్యకర్తలు తమ పరిధిలోని గర్భిణులకు వారి నివాసాలకు వెళ్లి క్రమం తప్పకుండా పోషకాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజరు లక్ష్మీదేవమ్మ సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని దూబగుంట అంగన్వాడీ కేంద్రంలో సోమవారం పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణుల సంరక్షణ, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందించే విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని పేర్కొన్నారు. పోషణ ట్రాకర్ యాప్‌లో ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేసుకుని బరువు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి సరైన పోషకాహారం అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఎస్.మాధవి, ఎం.బేబీరూస్సీ, వై.స్వాతి, డి.అనూష, బి.సునీత తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు విధిగా చేయించుకోవాలి

కందుకూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రైతులంతా విధిగా భూసార పరీక్షలు చేయించుకుని తదనుగుణంగా ఎరువులు వాడటం ద్వారా అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి వి.రాము కోరారు. మండలంలోని పలుకూరు, మహదేవపురం గ్రామాలలో సోమవారం భూసార పరీక్షలు, వరికి ప్రత్యామ్నాయంగా పంటల సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మండలంలో 984 మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయాలని ఉన్నతాధికారులు నిర్దేశించారన్నారు. రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి భూసార పరీక్షలు చేయించుకోవాలని కోరారు. వేసవిలో బోర్లు ఆధారంగా వరిసాగు చేసే రైతులు లాభసాటిగా ఉంటే తక్కువ కాలం పంటలైన మినుము, పెసర పంటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు బ్రాహ్మణి, షేక్ నజీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువల్లో పూడిక తీయించిన టీడీపీ నేత

కొండాపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలదీవి పంచాయతీలో మురుగు కాలువల్లో పేరుకుపోయిన మట్టి, చెత్తను గ్రామ టీడీపీ యువ నాయకుడు ఓరుగంటి మార్కండేయులు సోమవారం తన సొంత నిధులతో తీయించారు. ఆయన మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా మురుగు కాలువల్లో చెత్త, మట్టి పేరుకుపోవడంతో నీరు ప్రవహించకుండా నిలిచిపోయి దుర్గంధాన్ని వెదజల్లుతూ గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంచాయతీ పాలకులు పట్టించుకోకపోవడంతో సొంత నిధులతో శుభ్రం చేయిస్తున్నానన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కావలి రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నంగిదిన్నె పంచాయతీలోని తుమ్మలపెంట రోడ్డులో టీడీపీకి చెందిన మాజీ సర్పంచు మోర్ల అమరావతి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఎమ్పీడీవో శ్రీదేవి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గీత, స్థానిక టీడీపీ నాయకులు మోర్ల వెంకట్రావు, యాకోబు, వెంకయ్య, శ్రీహరి, అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ కమిటీ అధ్యక్షుడిగా బర్నాడ్

బిట్రగుంట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ కమిటీ నూతన అధ్యక్షుడిగా బర్నాడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం రైల్వే ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో జరిగిన సభ్యుల సమావేశంలో అధ్యక్షుడు స్వర్ణరాజ్, గౌరవాధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులుయాదవ్, ఫౌండర్ అధ్యక్షుడు కుందుర్తి శ్రీనివాసులు కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా అరుణ్‌కుమార్, కోశాధికారిగా మన్యం శ్రీనివాసులు, కొందరు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వాకర్స్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 8 అర్జీలు

దగదర్తి(బిట్రగుంట), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): దగదర్తి తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 8 అర్జీలు అందజేశారని తహసీల్దారు టీ.కృష్ణ తెలిపారు. పలు గ్రామాలకు చెందిన రైతులు చుక్కల భూముల సమస్యలు, వారసత్వంగా వచ్చిన భూములకు పాస్‌పుస్తకాల కోసం వినతులు అందచేసినట్లు ఆయన తెలిపారు.

బోగస్ మస్టర్లు వేస్తే కఠిన చర్యలు

● ఏపీడీ బాబురావు


వెంగళాపురంలో ఉపాధి హామీ కూలీల మస్టర్ తనిఖీ చేస్తున్న కందుకూరు ఏపీడీ బాబురావు

లింగసముద్రం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు బోగస్ మస్టర్లు వేసి అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆ పథకం కందుకూరు అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ జే.బాబురావు హెచ్చరించారు. ఎర్రారెడ్డిపాలెం పంచాయతీలోని వెంగళాపురంలో జరుగుతున్న కాలువ, కుంట పూడికతీత పనులను సోమవారం ఆయన తనిఖీ చేశారు. రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరుగుతున్న పనులకు 60 మంది చొప్పున 120 మంది కూలీలు పనులకు హాజరు కాగా వారిలో ఒకరికి బదులు మరొకరు వచ్చిన 20 మందిని గుర్తించి వారిని పనుల నుంచి వెనక్కు పంపించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడుతూ ఇలా ఒకరికి బదులు మరొకరు పనులకు రాకూడదని చెప్పారు. 18 ఏళ్లు నిండిన వారికి జాబ్‌కార్డు లేకపోతే 24 గంటల్లో జాబ్‌కార్డు ఇప్పిస్తామన్నారు. పనులకు రాని వారికి మస్టర్లు వేస్తే పని చేసే కూలీలకు నష్టం కలిగి తక్కువ కూలి వస్తుందని చెప్పారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనుల్లో విజయవాడలో ఉంటున్న కొందరికి బోగస్ మస్టర్లు వేసి అవినీతికి పాల్పడుతున్నారని గ్రామానికి చెందిన వారు డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ గంగాభవానికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారని, దీంతో ఆమె ఆదేశాల మేరకు పనుల తనిఖీకి వచ్చినట్లు ఆయన చెప్పారు. మంగళవారం కూడా ఎర్రారెడ్డిపాలెంలో పనులను తనిఖీ చేసి నివేదికను పీడీకి పంపిస్తామని తెలిపారు.

బీటెక్ విద్యార్థినికి ఉత్తమ ఎన్‌సీసీ క్యాడెట్ అవార్డు


ఉత్తమ ఎన్‌సీసీ క్యాడెట్ అవార్డు అందుకుంటున్న విద్యార్థిని సాయిలక్ష్మీప్రియంవద

కందుకూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ పీ. సాయిలక్ష్మీప్రియంవద ఉత్తమ ఎన్‌సీసీ క్యాడెట్ అవార్డు అందుకున్నారని కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య తెలిపారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న ప్రియంవద ఫైరింగ్, డ్రిల్‌టెస్ట్, రాతపరీక్ష, ఇంటర్వ్యూలలో విశేష ప్రతిభ కనబరచటం ద్వారా ఈ అవార్డు దక్కించుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. 34(ఏ) బెటాలియన్‌లోనే ఉత్తమ క్యాడెట్‌గా ఎంపికైన ఆమె లెఫ్టినెంట్ కల్నల్ వి.మోహన్, సుబేదార్ మేజర్ పుష్పరాజ్‌ల చేతుల మీదుగా రూ.4500 నగదు బహుమతి కూడా అందుకోవటం కళాశాలకే గర్వకారణమని, ఆమె సాధించిన విజయం మిగిలిన ఎన్‌సీసీ క్యాడెట్లుకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల టెక్నికల్ డైరెక్టర్ కె.విజయ్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ మీరావలి తదితరులు ఆమెను అభినందించారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా రామ్‌రతన్‌జీ బాబా మహాస్తూపం

● మాజీ మంత్రి మానుగుంట మహీధరరెడ్డి


రామ్‌రతన్‌జీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మానుగుంట మహీధరరెడ్డి

కందుకూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): గురు రామ్‌రతన్‌జీ ఆశ్రమంలో నిర్మించిన 108 అడుగుల బాబా స్తూపం భవిష్యత్తులో గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా మారుతుందని మాజీమంత్రి మానుగుంట మహీధర రెడ్డి పేర్కొన్నారు. మచిలీపట్నం సమీపంలోని గూడూరు వద్ద ఉన్న ఆశ్రమంలో మహీధరరెడ్డి ఛైర్మన్‌గా ఉన్న మానసాదేవి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించిన రామ్‌రతన్‌జీ బాబా విగ్రహాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వయోగి విశ్వంజీ మహారాజ్ ముఖ్య అతిథిగా పాల్గొనగా మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి, మచిలీపట్నం ఎంపీ బాలశౌరి, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, పెడన ఎమ్మెల్యే కాగితపు కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కందుకూరు నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో తరలివెళ్లిన అభిమానులు మహీధరరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వలేటి రాఘవులుకు ఘన నివాళి

కందుకూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ వలేటి రాఘవులు 4వ వర్థంతి కార్యక్రమాన్ని పార్టీ నాయకులు సోమవారం ఆయన స్తూపం వద్ద నిర్వహించారు. ఆయన సేవలను కొనియాడుతూ ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పోకూరి మాలకొండయ్య, బీ.సురేష్‌బాబు, ఆనంద్‌మోహన్, మాధవరావు, ఎం.లక్ష్మీనారాయణ, మురళి, డి.ఆదినారాయణ, కోటేశ్వరరావు, బాలబ్రహ్మాచారి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ముస్లింల వ్యతిరేక నల్లచట్టాలు రద్దు చేయాలి

● వక్ఫ్‌బోర్డు చట్ట సవరణకు వ్యతిరేకంగా నల్ల జెండాలతో నిరసన ర్యాలీ ● భారీగా తరలివచ్చిన ముస్లిం మహిళలు



నల్ల జెండాలతో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

కావలిటౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతూ ముస్లింలకు వ్యతిరేకంగా తెచ్చిన మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని ముస్లిం సంఘాల జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. వక్ఫ్‌బోర్డు చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని మాగుంట పార్వతమ్మ రోడ్డుపై నిర్వహించిన నిరసన ర్యాలీ హోరెత్తింది. నల్ల జెండాలు చేతపట్టి జెండాచెట్టు వద్ద ప్రారంభమైన ర్యాలీ ఆర్డీవో కార్యాలయం వరకు సాగింది. తమ డిమాండ్లతో ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. అనంతరం మత పెద్దలు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 నుంచి 28 వరకు ప్రతి ఒక్కరికీ మత స్వేచ్ఛ ఉందన్నారు. ముస్లిం హక్కులను కాలరాయడం కోసం బీజేపీ కక్ష పూరితంగా వ్యవహరిస్తుందన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజలంతా కలిసిమెలిసి జీవిం చేవారని, పూర్వం ముస్లింలతో పాటు హిందువులు కూడా మసీదులు, దర్గాలు పీర్ల చావిడిల నిర్వహణకు తమ ఆస్తులను స్వచ్ఛందంగా దానం చేసి మత సామరస్యాన్ని చాటారని చరిత్ర చెబుతుందన్నారు. ముస్లిం హక్కు అయిన వక్ఫ్‌బోర్డులో సభ్యులుగా ముస్లిం వేతరులను నియమించడం దుర్మార్గమన్నారు. తమ మతపరమైన హక్కులు కాపాడుకునేం దుకు పెద్దఎత్తున ఉద్యమిస్తామని, అవసరమైతే ప్రాణాలు వదిలేందుకు సిద్ధమన్నారు. వక్ఫ్ సవరణ చట్టంపై కూటమి ప్రభుత్వ భాగస్వామ్య పార్టీలు నోరు విప్పి వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు. డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

వేరుశనగను ముంచిన వాతావరణం!

● అధిక వర్షపాతంతో తగ్గిన పంట దిగుబడి ● నాణ్యత లేక ధర ధమాల్ ● ఎకరాకు రూ.50 వేలు నష్టపోయిన రైతులు


బస్తాలకు కట్టిన వేరుశనగ కాయలు

ఉలవపాడు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ప్రతి కూల వాతావరణంతో వేరుశనగ పంట సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపో యారు. మండలంలోని కరేడు పంచాయతీ పరిధిలోని అలగాయపాలెం, టెంకాయచెట్ల పాలెం, బట్టిసోమయ్యపాలెం, చాకిచర్ల తదితర తీరప్రాంత గ్రామాల్లో సుమారు 1200 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశారు. వాతారవణం అనుకూలిస్తే ఎకరాకి 50 నుంచి 60 బస్తాలు పంట దిగుబడి వస్తుంది. ఒక్కో బస్తాకు 36 కేజీల వేరుశనగ కాయలు నింపుతారు. వేరుశనగ పప్పు దిగుబడి 80 శాతం ఉంటే ఆశించిన రేటు రూ.3000 పైనే పలుకుతోంది. అంతకు మించి తగ్గితే రేటు కూడా తగ్గిపోతేంది. దీంతో పెట్టుబడికి, విక్రయానికి మధ్య తేడా నష్టాలను చవిచూసేలా చేస్తోంది. ఈ క్రమంలో గడిచిన ఏడాది నవంబరు, డిసెంబరు నెలల్లో ఎడతెరపి లేకుండా వర్షాలు పడటంతో ఇసుక నేలల్లో నీటి నిల్వలు పెరిగాయి. దీంతో వాతావరణం అనుకూలించక వేరుశనగ పంట గుబురువేరు విస్తరించక కాయ దిగుబడి తగ్గింది. నీటి ఊట శాతం అధికంగా ఉన్న పొలాల రైతులు రెండు సార్లు విత్తనాలు వేయాల్సి వచ్చింది. దీంతో ఎకరాకి రూ.లక్ష పెట్టుబడి పెట్టినా ఆశించినంత దిగుబడి రాక ఎకరాకి గరిష్ఠంగా 30 బస్తాలు పంట చేతికొచ్చిందని రైతులు దిగాలు చెందారు. దిగుబడి తగ్గడంతోపాటు కాయల నాణ్యత శాతం తగ్గడంతో 36 కేజీల బస్తా రూ.2500లకు అమ్ముడుపోతోంది. కౌలు చెల్లింపు, సేద్యం పెట్టుబడి, విత్తనాల రేటు అన్ని కలిపితే ఎకరాకు సుమారు రూ.లక్ష ఖర్చు అవుతోంది. అధిక భాగం రైతుల పంట దిగుబడి 25 బస్తాలకు పరిమితం అయ్యింది. దీంతో ఎకరాకు సుమారు రూ.50 వేలు నష్టం వచ్చినట్లు రైతులు వాపోతున్నారు.

భారీగా నష్టం వచ్చింది



ఈ ఏడాది నా సొంత పొలం 4 ఎకరాలు, కౌలుకు 8 ఎకరాలు తీసుకుని 12 ఎకరాల్లో వేరుశనగ సేద్యం చేశాను. ఒక కారు పంటకు రూ.25000 కౌలుకు తీసుకున్నాను. వర్షాల వల్ల ఇసుక నేలలో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో కాయ దిగుబడి, నాణ్యత తగ్గి రేటు పడిపోండంతో భారీగా నష్టం వాటిల్లింది.

- పాదాల మురళీ కృష్ణ, వేరుశనగ రైతు

ప్రతి పథకాన్ని అర్హులకు అందించాలి

● ఆముదాలదిన్నె సచివాలయంలో ఎంపీడీవో శ్రీదేవి తనిఖీ


సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీదేవి

కావలిరూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అదించే ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులకు అందేలా చూడాలని ఎమ్పీడీవో శ్రీదేవి పేర్కొన్నారు. మండలంలోని ఆముదాలదిన్నె గ్రామ సచివాలయాన్ని సోమవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వం సూచించే సర్వేను 100 శాతం పూర్తి చేయాలన్నారు. ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం ఉద్యోగుల హాజరుతో పాటు వివిధ రికార్డులను పరిశీలించారు.



వైసీపీ బొమ్మల పిచ్చి

● ప్రజాధనం వృథా

వైసీపీ పాలనలో జగన్ బొమ్మల పిచ్చితో ప్రజా ధనం వృథా అయింది. ప్రభుత్వ భవనాలకు వైసీపీ రంగులు, రైతుల భూముల పాస్ పుస్తకాలపై జగన్ బొమ్మలు వేశారు. చివరకు సచివాలయాల ద్వారా మంజూరుచేసే పలు రకాల సర్టిఫికెట్లపై కూడా నవరత్నాలు లోగో, జగన్ బొమ్మలు వేశారు. కాగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయాల ద్వారా మంజూరుచేసే సర్టిఫికెట్లపై బొమ్మలను తొలగించింది. దీంతో గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లా పరిషత్తు కార్యాలయం నుంచి మండల పరిషత్తు కార్యాలయాలకు అందిన హైసెక్యూరిటీ పేపర్లు పనికిరాకుండా పోయాయి. దీంతో ఈ పేపర్ బండిళ్లను సోమవారం మండల పరిషత్తు అధికారులు తిరిగి జడ్పీకి పంపారు.

- కలువాయి, (ఆంధ్రజ్యోతి)

ఆత్మకూరులో ముఖ్యమంత్రి పర్యటన

● త్వరలో అధికారికంగా ఖరారు

● రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మే 1న ఆత్మకూరులో పర్యటించనున్నట్లు, అధికారికంగా ఖరారు కావాల్సి ఉందని రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం పర్యటన ఏర్పాట్లపై మంత్రి ఆనం అధికారులతో సమావేశం నిర్వహించారు. మే 1వ తేదీన ఆత్మకూరు సమీప గ్రామంలో పింఛన్ల పంపిణీ, నారంపేట వద్ద ఎమ్ఎస్ఎమ్ఈ పార్కు ప్రారంభోత్సవం అనంతరం పార్టీ కార్యకర్తల సమావేశంలో సీఎం పాల్గొంటారని ప్రాథమిక సమాచారం అందినట్లు తెలిపారు. అనువైన ప్రాంతాన్ని హెలిప్యాడ్ కోసం ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. ఆర్అండ్‌బీ, రెవెన్యూ, పోలీసు, ఎలక్ట్రికల్, మున్సిపల్ శాఖ అధికారులు సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు సమన్వయంతో చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో బీ పావని, డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సీ గంగాప్రసాద్, ఆర్అండ్‌బీ ఎస్ఈ గంగాధర్, ఈఈ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



భూ సమస్యల పరిష్కారంలో

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఓ ఆనంద్ అధికారులను హెచ్చరించారు. సోమంవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. ఈ సందర్భంగా ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించేందుకు ఆయాశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. నిర్దిష్ట గడువులోగా అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

● పీఎం విశ్వకర్మ పథకం కింద లబ్ధిదారులకు వివిధ వృత్తుల్లో శిక్షణ ఇప్పించాలని కోరుతూ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఖాజన వెంకట శేషయ్య ఆచారి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ప్రధాన కార్య దర్శి తల్లం సురేష్ ఆచారి, కోశాధికారి ఏలూరు బాబు ఆచారి, శ్రీమంతుల రఘునాథ్‌ఆచారి, వేములూరు రఘురామయ్య ఆచారి పాల్గొన్నారు.

● ఇటీవల విడుదలైన బీసీ స్వయం ఉపాధి రుణాల మంజూరులో అవకతవకలపై విచారణ జరిపించాలని ఏపీ బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దులూరు సుభాష్‌యాదవ్, జేసీకి వినతిపత్రం సమర్పించారు. అవకతవకలకు కారణమైనవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



అర్జీదారుల నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్

● కనిగిరి రిజర్వాయర్‌లో మత్స్యసంపదను వేలం వేయవద్దని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష, పొట్టేళ్ల నాగరాజు, శివనాగమణి తదితరులు పాల్గొన్నారు.

● ఊటుకూరు దళితులపై మైనింగ్ మాఫియా పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు డీపీ పోలయ్య కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. భూస్వాముల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను దళితులకు, ఇతర పేదలకు పంచాలని కోరారు.

● పిత్రార్జితంగా సంక్రమించిన స్థిరాస్తిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పొదలకూరు మండలం మహమ్మదాపురం గ్రామ కాపురస్తుడు పల్లిబోయిన వెంకట శేషయ్య కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆక్రమణదారుల నుంచి తన భూమిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు

● జిల్లాలోని ఏఎస్‌పేట మండల కేంద్రంలో ఉన్న ఉర్దూ పాఠశాలను ఎంపీయూపీ పాఠశాలలో విలీనం చేయవద్దని ఆ పాఠశాల కమిటీ చైర్మన్ పఠాన్ షాన్వాజ్, సభ్యులు పఠాన్ సందానీఖాన్, గండువారిపల్లి బాషా తదితరులు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ ఉర్దూ పాఠశాలను ఎంపీయూపీ పాఠశాలలో విలీనం చేయడం వల్ల ఉర్దూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఎంతో నష్టపోతారన్నారు. ముస్లింల జనాభా ఎక్కువగా ఉన్న ఏఎస్‌పేటలో ఉర్దూ పాఠశాల ఎంతో అవసరమన్నారు. అధికారులు ఈ విషయంపై స్పందించి ఉర్దూ పాఠశాల విలీనాన్ని ఆపాలని కోరారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 119 వినతులు

● మండుటెండలోనూ తరలివచ్చిన అర్జీదారులు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు తెలుపుకునేందుకు మండుటెండలోనూ జిల్లా వ్యాప్తంగా ప్రజలు పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు తరలివచ్చారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన వేదికకు 119 మంది అర్జీదారులు హాజరై సమస్యలను ఎస్పీ జీ కృష్ణకాంత్‌తో పాటు ఇతర పోలీసు అధికారులకు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఎస్పీతోపాటు ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీటీసీ డీఎస్పీ గిరిధర్, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

● రాపూరు ప్రాంతానికి చెందిన వ్యక్తికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి తెలంగాణ రాష్ట్రంలోని గోదావరిఖని ప్రాంతానికి చెందిన శ్వేత రూ.4.58 లక్షల నగదు తీసుకుంది. ఉద్యోగం ఇప్పించకపోగా, నగదు తిరిగి ఇవ్వకుండా మోసం చేసిందని, న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

● నెల్లూరు రూరల్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి అతడి వద్ద నగరానికి చెందిన విజయ భాస్కర్‌రెడ్డి రూ.84 వేలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోగా, తిరిగి నగదు ఇవ్వలేదని బాధితుడు పేర్కొన్నాడు. న్యాయం చేయాలని కోరాడు.



అర్జీదారుడి సమస్యను వింటున్న ఎస్పీ కృష్ణకాంత్

● తెలంగాణ రాష్ట్రంలోని మిర్యాలగూడకు చెందిన వ్యక్తికి కావలికి చెందిన దేవరకొండ కిషోర్, అతడి అనుచరులు తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామని నమ్మించారు. దీంతో అతను వారికి రూ.40.90 లక్షలు ఇచ్చాడు. వారు బంగారు ఇవ్వకపోగా, నగదు అడుగుతుంటే చంపేస్తామని బెదిరిస్తున్నారని బాధితుడు పేర్కొన్నారు. విచారించి న్యాయం చేయాలని కోరాడు.

● తన కుమార్తె నగరంలోని చిన్నబజారు పోలీసు స్టేషన్ పరిధిలో అత్తవారి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని, ఆమె బలవన్మరణానికి అల్లుడు, అత్త, మేనమామ కారణమని, ఈ విషయమై దర్యాప్తు చేయాలని ప్రకాశం జిల్లాకి చెందిన వ్యక్తి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరాడు.

టీచరు కల.. నెరవేరుతున్న వేళ!

● మెగా డీఎస్సీతో నిరుద్యోగుల్లో ఉత్సాహం

● జిల్లాలో కొలువుల కోలాహలం

డీఎస్సీ ప్రకటన నిరుద్యోగుల్లో ఆనందాన్ని, ఉత్సాహాన్ని నింపింది. ఉపాధ్యాయ కొలువే లక్ష్యంగా డీఈడీ, బీఈడీ పూర్తి చేసి ఏళ్లతరబడి నిరీక్షిస్తున్న నిరుద్యోగ అభ్యర్థులు సంబరాల్లో మునిగిపోయారు. రాష్ట్రంలో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఈసారి డీఎస్సీలో వయోపరిమితి పెంచడంతోపాటు క్రీడా కోటాలోనూ వెయిటేజీ పెంచారు. ఇవన్నీ నిరుద్యోగులకు కలిసివచ్చే అంశాలు కాగా వయోపరిమితి పెంపుతో ఎంతోమంది అవకాశం కూడా లభించనుంది. నిరుద్యోగులకు ఊరట కలిగించేలా నిర్ణయం తీసుకోవడంతో ఉపాధ్యాయ అభ్యర్థుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని మేనేజ్‌మెంట్‌లలో 673 పోస్టులు భర్తీ చేయనుండటంపై అభ్యర్థులంతా రెట్టించిన ఉత్సాహంతో సిద్ధమవుతున్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం



నిరుద్యోగ యువతకు ఊపిరి

ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఏడేళ్ల నుంచి ఎదురు చూపులకు కూటమి ప్రభుత్వం ఊపిరి పోసింది. గత టీడీపీ ప్రభుత్వం 2018లో భర్తీ చేసిన పోస్టులు తర్వాత వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగ యువతను విస్మరించింది. 5 ఏళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో నిరాశతో కాలం గడపాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం మాలాంటి నిరుద్యోగులకు ఊరటనిచ్చినట్లైంది.

- తాళ్లూరి కృష్ణ, ఉలవపాడు



శుభ పరిణామం

గత ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించలేదు. ఇప్పుడు పోస్టులు పెంచుతూ మెగా డీఎస్సీ ప్రకటించడం శుభ పరిణామం. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నా. ఈ విద్యా సంవత్సరం నాటికి నియామక ప్రక్రియ పూర్తి చేయాలి.

- షేక్ నాజియ, ఉదయగిరి



అద్భుతం జరిగింది

ప్రభుత్వ ఉపాధ్యాయులవుతామన్న ఆశ వదులుకుని ప్రత్యామ్నాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్న తరుణంలో రాష్ట్రప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం నిజంగా అద్భుతం. దీంతో మళ్లీ ప్రభుత్వ ఉపాధ్యాయులవుతామన్న ఆశలు చిగురించాయి. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు సీఎం చంద్రబాబుకు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు.

- డీ.మాధవి, కావలి



మాలో జీవం నింపింది

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్ 16,347 మంది డీఎస్సీ అభ్యర్థుల జీవితాలకు జీవం పోసింది. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైన వెంటనే బంధుమిత్రులు ఫోన్ చేసి విషయం చెబితే నమ్మశక్యం కాలేదు. నిజమని తెలుసుకున్నాక ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన మేలు మరవలేం. ఆయనకు రుణపడి ఉంటాం.

- తాటిపర్తి హరికృష్ణ, కావలి



ఎంతో ఆనందకరం

ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం ఆనందంగా ఉంది. ఎంతోకాలంగా టెట్, డీఎస్సీకి ప్రిపేరై నోటిఫికేషన్‌లు లేకుండా డీలా పడిన మాలాంటి నిరుద్యోగులకు ఈ నోటిఫికేషన్ ఊరటనిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు.

- జి.ప్రమీల, కేకేపల్లి, పొదలకూరు



ఎంతోమందికి అవకాశం

ప్రభుత్వం మాట నిలబెట్టుకుంది. ఎక్కువ పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం హర్షణీయం. వయో పరిమితి 42 ఏళ్ల నుంచి 44 ఏళ్లకు పెంచడం ద్వారా ఎంతోమంది యువతకు ఇది ఒక మంచి అవకాశం.

- సింగాల వెంకటేశ్వర్లు, సీతారామపురం



హామీ నిలబెట్టుకున్నారు

నిరుద్యోగులకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వరం లాంటిది. ఇందులో ఆప్షన్ల నమోదు, సర్టిఫికెట్ల అప్‌లోడ్ విషయంలో నూతన విధానాలు తీసుకురావడం ఆనందంగా ఉంది. ఫీజుల చెల్లింపుల విషయంలో క్లారిటీ ఉంది. నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబుకు థ్యాంక్స్.

- కాకులూరు స్వప్న, పొదలకూరు



8 ఏళ్ల నిరీక్షణ ఫలిస్తోంది

2014-15లో బీఈడీ పూర్తి చేశాను. కోర్సు పూర్తి చేసుకున్న మొదట్లో డీఎస్సీ పరీక్షకు అనివార్య కారణాల వల్ల హాజరు కాలేక అవకాశాన్ని వదులుకున్నాను. అప్పటి నుంచి డీఎస్సీ కోసం నిరీక్షిస్తున్నాను. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ ప్రకారం యువతకు అవకాశాన్ని కల్పించినందుకు ఆనందంగా ఉంది. పరీక్షకు సిద్ధమయ్యేందుకు కనీసం 75 నుంచి 90 రోజుల సమయం ఉండాలి. నిరుద్యోగంతో తిరుగుతున్న తమకు డీఎస్సీ నోటిఫికేషన్ ఊపిరి పోసినట్టయింది.

- నిడిగుంట రాజకిషోర్. అల్లూరు



ఓసీ అభ్యర్థులకు వరం

ఆరేళ్ల తర్వాత కూటమి ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించడం సంతోషంగా ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నిలబెట్టుకున్నారు. ఈ ఉద్యోగ ప్రకటన కోసం ఎంతో కాలం నుంచి ఎదురు చూస్తున్నాను. టీచరు ఉద్యోగం సాధించేందుకు చాలా కష్టపడి చదువుతున్నాను. ఈసారి ఎలాగైనా ఉద్యోగం సాధిస్తాననే నమ్మకం ఉంది. అలాగే ఓసీ అభ్యర్థులకు వయో పరిమితిని 42 నుంచి 44 ఏళ్లకు పెంచడంతో వారికి మేలు చేకూరింది.

- నాయుడు శైలజ, లింగసముద్రం

గ్రావెల్ మాఫియాకు చెక్!

• గ్రామస్థుల ఫిర్యాదుతో అడ్డుకున్న ఎమ్మెల్యే కాకర్ల

• వాహనాల సీజ్.. అధికారుల తీరుపై ఆగ్రహం

• ఉదయగిరిని వీడాలని మాఫియాకు హెచ్చరిక





గ్రావెల్ తవ్వకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్, సీజ్ చేసిన వాహనాలు

ఉదయగిరి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వింజమూరు మండలం నల్లగొండ ప్రాంతంలో గత కొన్నిరోజులుగా కొందరు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారని ఆ గ్రామస్థులు సోమవారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన హుటాహుటిన అధికారులకు సమాచారం ఇవ్వకుండా తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. అక్కడ జరుగుతున్న తవ్వకాలను చూసి ఎమ్మెల్యే ఆశ్చర్యపోయారు. ఎమ్మెల్యే వెళ్లారన్న సమాచారం తెలుసుకున్న అధికారులు సైతం హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇంత భారీ ఎత్తున ప్రభుత్వ భూమిలో గ్రావెల్ తరలిస్తుంటే ఏం చేస్తున్నారని అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని తహసీల్దారు అబ్దుల్ హమీద్‌ను ఆదేశించారు. గ్రావెల్ తరలిస్తున్న 4 ట్రాక్టర్లు, రెండు టిప్పర్లు, ఒక హిటాచీ వాహనాలను, గ్రావెల్ డంప్‌ను సీజ్ చేయించారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపట్టాలని రెవెన్యూ, పోలీస్, విజిలెన్స్ అధికారులను ఆదేశించారు.

● **మాఫియాను వెంటాడతా**

అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో సహజ సంపదలు పుష్కలంగా ఉన్నాయని, వాటిని దోచుకుంటుంటే చూస్తూ ఊరుకోనన్నారు. మైనింగ్ మాఫియా తన నియోజకవర్గాన్ని విడిచి వెళ్లాలని, లేదంటే వెంటాడతానని హెచ్చరించారు. కొంతమంది పని గట్టుకుని తన పేరు చెప్పి అక్రమాలకు పాల్పడుతున్నారని, అలాంటివి అధికారులు నమ్మవద్దన్నారు. ఈ కార్యక్రమంలో కలిగిరి సీఐ వెంకట నారాయణ, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కమ్మసాయిపై పీడీయాక్ట్ ఉత్తర్వులు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చంద్రమౌళినగర్‌కు చెందిన లక్ష్మిశెట్టి సాయితేజ అలియాస్ కమ్మసాయిపై పీడీయాక్ట్‌కు అనుమతిస్తూ కలెక్టర్ ఆనంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వేదాయపాలెం పోలీసు స్టేషన్‌లో కమ్మసాయిపై రౌడీషీట్ ఉంది. 2022 మేలో ఆయనపై పోలీసు అధికారులు పీడీయాక్ట్ ప్రయోగించారు. ఏడాదిపాటు కడప జైలులో ఉండి బయటకు వచ్చాడు. అయినా అతడి ప్రవర్తనలో మార్పురాలేదు. బాలాజీనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో ఓ హత్య, మూడు హత్యాయత్నాలు, దోపిడీ, దౌర్జన్యం కేసులున్నాయి. దీంతో పోలీసులు పీడీయాక్టు నమోదు చేశారు. ఈ క్రమంలో ఈనెల 15న రాత్రి వేదాయపాలెం పోలీసులు జిల్లా కేంద్రకారాగారం రిమాండ్‌లో ఉన్న కమ్మసాయికి నోటీసులు ఇచ్చి కడప కేంద్ర కారాగారానికి తరలించారు. ఈ మేరకు కలెక్టర్ సోమవారం పీడీయాక్ట్‌ను అనుమతిస్తూ ఉత్తర్వులిచ్చారు.

ఉపాధి కార్యాలయంలో రేపు జాబ్‌మేళా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 23న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం. వినయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కపిల్ చిట్స్‌లో కలెక్షన్ స్టాఫ్, అకౌంట్ సెక్షన్ స్టాఫ్ ఉద్యోగాలకు, క్రెడ్‌యాక్సిస్ గ్రామీణ్ లిమిటెడ్‌లో ఫీల్డ్ ఆఫీసర్ పోస్టులకు ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఏదైనా డిగ్రీ, ఎంబీఏ విద్యార్హతలు కలిగి, 20 నుంచి 35ఏళ్లలోపు వారు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని తెలిపారు.



అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఆర్వో ఉదయ భాస్కర్‌రావు

సర్వేలో వ్యతిరేకతపై కౌన్సెలింగ్

● జాయింట్ కలెక్టర్ కార్తీక్ వెల్లడి

నెల్లూరు (హరనాథపురం) ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై నిరంతరం నిర్వహిస్తున్న సర్వేలో వ్యతిరేకత వ్యక్తమైన అధికారులు, సిబ్బందికి ఒకటికి రెండుసార్లు కౌన్సెలింగ్ ఇవ్వనున్నామని, అప్పటికీ వ్యతిరేకత వస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని జేసీ కే. కార్తీక్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో రీసర్వే పురోగతి, తదితర అంశాలపై వివిధశాఖల అధికారులతో జేసీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండోదశ రీసర్వేను గ్రామాల్లో గ్రామసభలు ముగిసిన వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని పాఠశాలల్లోని అన్నీ ఆర్వో ప్లాంట్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి, పాఠశాలలు పునఃప్రారంభించే నాటికి సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలుకు సంబంధించి ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా లబ్ధిదారుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నట్లు జేసీ తెలిపారు. పింఛన్ల పంపిణీ, అన్న క్యాంటీన్లు, రేషన్ పంపిణీ, దీపం గ్యాస్ కనెక్షన్లు, ఆర్టీసీ సేవలు, విద్యుత్ తదితర సేవలపై ఎప్పటికప్పుడు ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలంతా సంతృప్తి చెందేలా ప్రభుత్వ సేవలను అందించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో మనమిత్ర యాప్ గురించి అవగాహన కలిగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఉదయభాస్కర్, డీపీవో శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగాభవాని, జడ్పీ డిప్యూటీ సీఈవో మోహన్‌రావు, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఈలు విజయన్, వెంకటరమణ పాల్గొన్నారు.

రాష్ట్ర చెస్ పోటీల విజేత శ్యామ్యూల్ స్టీఫెన్

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా చెస్ సంఘం, శ్రీఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని సిల్వర్‌ఓక్స్ పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర చెస్ పోటీల్లో అనంతపురానికి చెందిన శ్యామ్యూల్ స్టీఫెన్ నోబెల్ చాంపియన్‌గా నిలిచాడు. అలాగే హైదరాబాద్‌కి చెందిన ఎం.అక్షయ్‌కుమార్ ద్వితీయస్థానం, నెల్లూరుకి చెందిన పీ.హరిరామ్ సాయికృష్ణ తృతీయ స్థానం సాధించారు. వీరితోపాటు నెల్లూరుకి చెందిన ఎం.రామ్‌లికిత్ నాలుగవస్థానం, తిరుపతి జిల్లా గూడూరుకి చెందిన బీ.గిరిబాబు ఐదుస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఫన్‌పార్క్ ఎండీ సాయి పొత్తూరి అతిథిగా పాల్గొని మాట్లాడారు. చదరంగం క్రీడా సాధనతో యువత, విద్యార్థుల్లో మానసిక వికాసం పెరుగుతుందన్నారు. క్రీడాకారులంతా గెలుపోటములను సమానంగా తీసుకుని క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. విద్యార్థులను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వేసవి సెలవుల్లో ఫన్‌పార్క్‌లో ఆలిండియా ఓపెన్ చెస్‌పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం విజేతలకు నగదు బహుమతులు, సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఆర్ కల్యాణ మండపం అధినేత పచ్చిపులుసు శ్రీరాములు, ఘుమఘుమల రెస్టారెంట్ యజమాని ఎస్.కళ్యాణ్, రాష్ట్ర చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి వై.సుమన్, కడపజిల్లా చెస్ సంఘం కార్యదర్శి అనీస్, శ్రీఆనంద్ వింగ్స్ చెస్ అకాడమీ డైరెక్టర్ ఎం.గోపీనాథ్, కోచ్ డాక్టర్ మధుసూదన్, జేసీస్ జోనల్ వైస్ చైర్మన్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



తొలి మూడు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులతో పోటీల నిర్వాహకులు

కొరవడిన పారిశుధ్యం

పొదలకూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టైలర్స్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. సైడ్‌కాలువలోని మురుగునీరు ఇళ్లలోకి చేరి దుర్గంధం వెదజల్లుతున్నా పాలకులు, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. నెల రోజులుగా ఈ సమస్య ఉండటంతో ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ఎన్నికల సమయాల్లో ఇళ్లకు వచ్చి అది చేస్తాం ఇది చేస్తామని చెప్పే నాయకులు సమస్య తలెత్తినప్పుడు పత్తా లేకుండా పోతారని మండిపడుతున్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9285
వెండి కిలో ధర	రూ. 98,800
వెండి ఒక గ్రాము	రూ.101.60

న్యూస్ బాక్స్

ఘనంగా ప్రతిభ అవార్డుల మహోత్సవం



సన్మానం చేస్తున్న ఉపాధ్యాయులు

పొదలకూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తాటిపర్తి ఎంపీపీఎస్ ఎస్సీ పాఠశాలలో వార్షికోత్సవ ప్రతిభా అవార్డుల మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలు తాటిపర్తి రాఘవేంద్ర, రంగయ్యలు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రతి తరగతి పిల్లలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు, బహుమతులతో పాటు మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శోభనాద్రి, కాంప్లెక్స్ ప్రధానోపా ధ్యా యులు నాగ మోహన్‌రెడ్డి, సర్పంచ్, యూ టీఎఫ్ మండలాధ్యక్షుడు కల్యాణ్ పాల్గొ న్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరినీ ఎంఈవో చేతుల మీదుగా సన్మానించారు.

మనోజకు డాక్టరేట్



వెంకటాచలం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విక్రమ సిం హపురి యూని వర్సిటీలోని పర్యా టక విభాగ పరిశోధన విద్యార్థిని మనోజ పద్యాలకు వీఎస్‌యూ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈమె స్వస్థలం అనంతపురం జిల్లా నార్పల గ్రామం. కాగా వీఎస్‌యూలో గాస్ట్రోనమీ టూరిజం, స్థిరమైన పర్యాటక అభివృద్ధికి ఒక సంభావ్య మౌల్యాంకన అంశంపై పర్యాటక విభాగానికి చెందిన డాక్టర్ కోట నీలమణికంఠ పర్యవేక్షణలో పరిశోధన విజయవంతంగా పూర్తి చేసింది. సోమవారం మనోజను వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ మధుమతి, పర్యాటక విభాగాధిపతి డాక్టర్ సుజాత, ప్రొఫెసర్లు కేవీఎస్ ఎన్ జవహర్‌బాబు, డాక్టర్ ఎం.త్యాగరాజు ప్రత్యేకంగా అభినందించారు.

వైభవంగా సీతారామ కల్యాణం



పాల్గొన్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాముడుపాలెం మజరా పల్లెపాలెంలో సోమవారం సీతారామ కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, పొన్నెబోయిన చెంచుకిషోర్ యాదవ్, కొండూరు సుధాకర్‌రెడ్డి, బొద్దులూరు సుధాకర్, అవ్వారు ఏడుకొండలు, బండ్ల ఉదయ్‌కుమార్, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

వెంకటాచలం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):గొలగమూడి సమీపంలోని గురుకుల బాలికల పాఠశాలలో సోమవారం శక్తియాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు, బాల కార్మిక, వెట్టిచాకిరీ వ్యవస్థలు, మానవ అక్రమ రవాణా, పోక్సో యాక్ట్, మాదక ద్రవ్యాల నిషేధం, డయల్ 100, 112, 1098, 1930 మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమణ ప్రసాద్, శక్తి టీమ్ ఏఎస్ఐ సుబ్బారాజు, సిబ్బంది శామ్యూల్, శ్రీనివాసులు, రంగయ్య, సుప్రియ ఉన్నారు.

అసంపూర్తి సచివాలయాలు

- విడవలూరు బిట్-1, చౌకిచర్లలో ప్రారంభం కాని పనులు
- ప్రభుత్వం ధనం దుర్వినియోగం అంటున్న ప్రజలు

విడవలూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచి వాలయ భవన నిర్మాణాలను అట్టహాసంగా ప్రారంభించిన వైసీపీ ప్రభుత్వం వాటిని పూర్తి చేయకుండానే వదిలేయడంతో నిర్మాణాలు సగంలోనే నిలిచిపోయాయి. ప్రస్తుతం ఈ నిర్మాణాల్లో చెట్లు, పిచ్చి మొక్కలు మొలిచాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజా ధనాన్ని ఏ విధంగా దుర్వినియోగం చేసేశారో సచివాలయ భవనాలు అద్దం పడుతున్నాయి. మండలంలో సుమారు రూ.4.50 కోట్లతో 13 సచివాలయ భవన నిర్మాణాలకు అప్పటి ప్రభుత్వం శ్రీకా రం చుట్టింది. వీటిలో ముదివర్తి, అన్నారెడ్డి పాళెం, గాదెలదిన్నె గ్రామాల్లో సచివాలయ భవనాలను 90 శాతం మేరకు పూర్తి చేశారు. విడవలూరు బిట్-1, చౌకిచర్ల సచివాలయ భవనాలు ప్రారంభం కాలేదు. పార్లపల్లి, విడవలూరు బిట్-2 ఊటుకూరు బిట్-2, వావిళ్ల, అలగా నిపాడు, రామతీర్థం, రామచంద్రాపురం, దంపూరులోని సచివాలయాలు వివిధ దశల్లో అసంపూర్తి గా నిలిచిపోయాయి.



పార్లపల్లిలో పునాదుల దశలోనే..



విడవలూరులో అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనం

● నిధులు వస్తే పనులు పూర్తి చేస్తాం

గత ప్రభుత్వహయాంలో ప్రారంభమైన గ్రామ సచివాలయాల భవనాలు చాలా గ్రామాల్లో పూర్తికాలేదు. అసంపూర్తిగా ఉన్న ఈ భవనాలకు ఈ ప్రభుత్వం నిధులను విడుదల చేస్తే భవనాలను పూర్తి చేస్తాం.

- శ్యాంసుందర్‌రెడ్డి, పీఆర్ ఏఈఈ, విడవలూరు

ఆక్రమణలు తొలగించాలి: జడ్పీ సీఈవో



ఆక్రమణలు పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో విద్యారమ

పొదలకూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక గేట్ సెంటర్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆక్రమణలకు గురైన స్థలాన్ని తొలగిస్తామని జడ్పీ సీఈవో విద్యారమ తెలిపారు. సోమవారం ఆమె స్థానిక అధికారులతో కలిసి పాఠశాలలో తనిఖీలు నిర్వహించారు. పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని సర్వే చేయించారు. సర్వే నెం బరు 502-ఏ-1లో 2.79 ఎకరాలు మరో సర్వే నెంబరులో 502-ఏ-2లో ఏడు సెంట్ల భూమి కలిసి మొత్తం 2.86 ఎకరాలు బాలికల ఉన్నత పాఠశాలకు చెందినట్లు దస్త్రాల్లో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు సీఈవో దృష్టికి తెచ్చారు. అయితే పాఠశాల ముందు భాగం ఆరు సెంట్లు ఆక్రమణలకు గురైందని చెప్పడంతో ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి మంగళవారం సంజాయిషీ తీసుకుని తొలగించాలని ఆదేశించారు. ఈమె వెంట ఎంపీడీవో నరసిం హారావు, డిప్యూటీ తహసీల్దారు సురేఖా, ఎంఈవో రేణుక, పాఠశాల ప్రధానోపాధ్యాయినీ పెర్సిస్, సర్వేయర్ గోపీనాథ్, వీఆర్‌వోలు, పోలీసులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో ప్రయోజనకరం



మట్టి నమూనాలను పరిశీలిస్తున్న ఏడీ రాజ్‌కుమార్

ముత్తుకూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలు చేయించుకోవడం ప్రయోజనకరం అని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు రాజ్‌కుమార్ తెలిపారు. ముసు నూరువారిపాలెంలో సోమవారం భూసార పరీక్షలు, వరికి ప్రత్యామ్నాయ పంటల గు రించి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మట్టి పరీక్షలతో పోషకాల పరిణామాన్ని తెలుసుకుని దానికనుగుణంగా ఎరువులను వాడకుని ఖర్చును తగ్గించుకోవాలన్నారు. 2025-26లో మండలానికి 825మట్టి నమూనాలు సేకరించడం లక్ష్యం అన్నారు. రైతు సోదరులందరూ ఈ అవకా శాన్ని ఉపయోగించుకోవాలన్నారు. వేసవిలో వరికి ప్రత్యామ్నాయంగా పెసర, నువ్వు పంటలు అనుకూలమని మే చివరి వారం వరకు కూడా నాటుకు నేందుకు అవకాశం ఉంటుందన్నారు. పెసరలో పల్లాకు తెగులను నివారించే ఎల్‌జీజీ, నువ్వు పంటలో మేలైన వైఎల్‌ఎం 66రకాలను వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు శివజ్యోతి, అనూష, వ్యవసాయాధి కారి జోత్స్నరాణి, నాయకులు గోవర్ధన్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



మాట్లాడుతున్న ఎంపీడీవో కల్పన

వెంకటాచలం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం లాభదాయకం అని ఎంపీడీవో కల్పన సూచించారు. స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో సో మవారం వ్యవసాయ, ఉద్యానవన, వెలుగు, ఐసీడీఎస్ శాఖల అధికారులకు ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికపై నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. మండల రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా అవగాహన కల్పించాలన్నారు. పెట్టుబడి లేకుండా వ్యవసాయం చేయవచ్చనే దిశగా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. వరిసాగు చేసిన తర్వాత రైతులందరూ నవధాన్యాలను సాగు చేసినట్లైతే భూసారవంతం పెరుగుతుందన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయాన్ని అలవరుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీపీఎం మాలకొండ య్య, ఏడీపీ డీపీఎం మునిరత్నం, వ్యవసాయ శాఖ ఏడీ శ్రీనివాస రాజు, ఏవో హరికరుణాకర్‌రెడ్డి, ఏపీఎం రుక్మిణి, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి టంగు టూరు హిమల్‌కుమార్‌రెడ్డి, డీఎంఎంటీ వరలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

రైతులను ఇబ్బందులు పెడితే ఊరుకోం



జట్లకొండూరు గోదాము వద్ద ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు

మనుబోలు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గోదాంలకు వచ్చే రైతులను ఇబ్బందులు పె డితే ఊరుకునే ప్రసక్తేలేదని ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. మండలంలోని జట్లకొండూరు ప్రభుత్వ గోదాంల వద్దకు సోమవా రం ఆయన మండల టీడీపీ నా యకులు, రైతులతో కలిసి వెళ్లి అధికారులను ప్రశ్నించారు. గోదాంలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్ వైసీపీ నా యకులకు అనుకూలంగా వ్యవహరిస్తూ, మిగతా రైతులను ఇబ్బందులు పె డుతున్నారని, ఈ విషయాన్ని పలు గ్రామాల రైతులు తమ దృష్టికి తీసుకరావడంతో ఇక్కడికి వచ్చామన్నారు. అనంతరం ఈ విషయంపై గో దాం మేనెజర్ వంశీరెడ్డితో చర్చించి ఆర్ఎంతో ఫోన్‌లో మాట్లాడారు. రైతుల ను ఇబ్బందులు పెట్టే ఉద్యోగిని తొలగించాలని డిమాండ్ చేశారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

ప్రతిభ విద్యార్థులకు ప్రశంసాపత్రం

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు స్కౌట్ అండ్ గైడ్స్‌లో చేరడంవల్ల క్రమశిక్షణతో పాటు సేవాభావం కలిగి ఉంటారని భరత్ స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ రాంకుమార్ తెలిపారు. సోమవారం దామరమడుగు జడ్పీ హైస్కూల్‌లో స్కౌట్ మాస్టర్ కృపాల్ ఆధ్వర్యంలో స్కౌట్ అండ్ గైడ్స్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆయనతో పాటు జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ శాంత కుమారితో సర్టిఫికెట్లు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నరసయ్య, మాస్టర్ ఇంతియాజ్ పాల్గొన్నారు.

తాటిపర్తిలో పోషణ్ పక్వాడ



మాట్లాడుతున్న సీడీపీవో విజయలక్ష్మి

పొదలకూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహమ్మదాపురం సెక్టార్ పరిధి లోని తాటిపర్తిలో సోమవారం సీడీపీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా సీడీపీవో విజయలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమం లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భవతిగా నమోదైనప్పటి నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయించుకోవాల్సిన రక్తపరీక్షలు, పౌష్టికాహారం గర్భంలోని పిండం పెరుగుదలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. అలాగే ప్రసవమైన తర్వాత తల్లీబిడ్డల సంరక్షణ, పాలు పట్టించే విధానం, వెయ్యి రోజుల సంరక్షణ గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఆదినారాయణమ్మ, ఉపాధ్యాయులు ఖాదర్‌బాషా, జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు పుష్పవేణి, పద్మజ, వరలక్ష్మీ, లక్ష్మీకాంతమ్మ, సుజాత, రోహిణి, శరణ్య, హెల్పర్ బుజ్జమ్మ, ఏఎన్ఎం టి.కవిత, ఆశా కార్యకర్త బేబి పాల్గొన్నారు.

నోషనల్ ఖాతాలను మార్చుకోవాలి

మనుబోలు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): నోషనల్ ఖాతాలను రైతులు త్వరగా మార్చుకోవాలని తహసీల్దార్ సీహెచ్.సుబ్బయ్య కోరారు. ఈ విషయంపై సోమవారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడారు. మండలంలో ఇప్పటివరకు 3,330మంది రైతులు నోషనల్ ఖాతాలను మార్చుకోవాల్సి ఉందని తెలిపారు. మార్చుకున్న రైతులకు రెగ్యులర్ ఖాతా నంబర్లు ఇస్తామన్నారు. రెగ్యులర్ ఖాతాలున్న వారికే ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, రాయితీలు వర్తిస్తాయన్నారు. ఈ నెల 25లోగా ఏ గ్రామానికి సంబంధించిన వారు వారి భూ పత్రాలు, ఖాతా నెంబర్ల వివరాలను వీఆర్‌వోల దగ్గర అందజేయాలన్నారు. అలాగే నెలాఖరులోగా ఈకేవైసీ గడువు ముగుస్తుందన్నారు. ఈకైవేసీ చేయించుకోకపోతే వచ్చే నెల నుంచి రేషన్ సరుకులు నిలిచిపోతాయన్నారు. కావున కార్డుదారులు ఈకేవైసీని సదరు డీలర్ లేదా వీఆర్‌వో వద్ద చేయించాలన్నారు.

వడదెబ్బపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు

ఇందుకూరుపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సన్‌స్ట్రోక్ (వడదెబ్బ)పై ఎంపీడీవో కె.నాగేంద్రబాబు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బ్రహ్మేశ్వర్‌నాయుడు ఆధ్వర్యంలో సోమవారం మండలస్థాయి అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు సన్‌స్ట్రోక్‌కు గురికాకుండా అధికారులు, ఉద్యోగులు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్యసిబ్బంది, ఆశవలంటీర్లతో అందజేస్తున్న ఓఆర్ఎస్ ప్యాకెట్లు వాడేటట్లు చూడాలని సూచించారు. వడదెబ్బ లక్షణాలున్న వారిని అత్యవసర వైద్యం కోసం జగదే విపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఇందుకూరుపేట సామాజిక ఆరోగ్య కేంద్రానికి 108 ద్వారా సకాలంలో చేర్చాలన్నారు. 60ఏళ్లు పైబడిన వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణీలు, బాలింత లు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడేవారు ఎండలోకి వెళ్లకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నాయక్, సీడీపీవో రాజ్యలక్ష్మి, ఏపీఎం సరిత, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కండలేరు నీటిమట్టం 45.801 టీఎంసీలు

రాపూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కండలేరు పూర్తిస్థాయి నీటి మట్టం 68 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి మట్టం 45.801 టీఎంసీలు ఉందని కండలేరు డ్యామ్ ఏఈ కట్టా తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల, ఇతర కాలువల నుంచి ఇన్‌ఫ్లో నీరు ఆగిపోగా, అవుట్‌ఫ్లో 315 క్యూసెక్కులుగా ఉందని తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి 235 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిస్ ద్వారా 50 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 30 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో అవుతుందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

రూ.3 కోట్లకు కుచ్చు టోపీ!?

- బోర్డు తిప్పేసిన ఔషధ దుకాణం నిర్వాహకులు
- పరారీలో ఒకరు

కావలి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఇద్దరు వ్యక్తులు కలసి మెడికల్ షాపు ఏర్పాటు చేసి వ్యాపారం ప్రారంభించారు. అందినకాడికి అప్పులు చేసి జనాలకు సుమారు రూ.3 కోట్లకు కుచ్చు టోపీ పెట్టి బోర్డు తిప్పేశారు. డబ్బుల లావాదేవీలతో సంబంధం ఉన్న ఆ ఇద్దరిలో ఒకరు పరారు కాగా తనకెలాంటి సంబంధం లేదని, తనను కూడా ఆ వ్యక్తి మోసం చేశాడంటూ మరో వ్యక్తి స్థానికంగా తప్పించుకు తిరుగుతున్నాడు. ప్రజల నుంచి అప్పులు తెచ్చి వ్యాపారాలు చేస్తారు. కాలం కలిసి వచ్చి ఆదాయాలు వస్తే తెచ్చిన వారికి ఇస్తారు. ఒకవేళ ఆదాయాలు రాక పోయినా నష్టాల బారిన పడక ముందే తమ కుటుంబ పోషణ అవసరాల మేరకు తెచ్చిన డబ్బులు భద్ర పరుచుకుని బోర్డులు తిప్పేసి ప్రజలకు కుచ్చు టోపీలు పెడతారు. ఇలా పలు వ్యాపార సంస్థలు చేస్తున్న మోసాలు అప్పుడప్పుడు ఇంటుంటుం. అయితే పోలీసులకు ఫిర్యాదులు చేస్తే కేసులు తప్ప వచ్చేతులమో పణమో కూడా రాదనే భయంతో ఎవరికి వారు మదనపడుతుంటారు. ప్రస్తుతం కావలిలో అలాంటి ఘటనే ఇప్పుడు వెలుగు చూసింది. వివరాల మేరకు.. కావలి పట్టణం ట్రంకురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం సమీపంలో ఇద్దరు వ్యక్తులు కలిసి మెడికల్ షాపు పెట్టుకుని వ్యాపారం చేస్తున్నారు. వారు ఆ ఒక్క వ్యాపారమే కాకుండా కొంత కాలం డాబా హోటల్, కారులు కొని అద్దెలకు నడపడం, తదితర వ్యాపారాలు చేశారు. అయితే ఏమి జరిగిందో గానీ వారంరోజులుగా మందుల దుకాణం మూసివేశారు. దీంతో వారికి అప్పులు ఇచ్చిన వారు ఆందోళన చెందుతుండడంతో అసలు విషయం వెలుగు చూసింది. 50మంది నుంచి రూ.3కోట్ల వివిధ రకాలుగా వసూలు చేసినట్లు తెలుస్తోంది. పలు మెడికల్ ఏజెన్సీల వద్ద భారీగా మందులు తెచ్చుకుని బిల్లులు చెల్లించలేదని, పలువురి చిట్ నిర్వాహకుల వద్ద చిట్స్ వేసి పాడుకుని నెలవారీ పేమెంట్లు కట్టలేదని బాధితులు వాపోతున్నారు. బాధితుల్లో ఎక్కువ మంది మెడికల్ ఏజెన్సీల వారు ఉండటంతో వారు మెడికల్ వ్యాపారుల అసోసియేషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. అయితే పలు వ్యాపారాలు చేసిన వీరికి ఎక్కడ నష్టాలు వచ్చాయో.. లేక నష్టాలు వ స్తాయనే భయం వేసిందో ఏమో కానీ మొత్తం మీద అప్పు ఇచ్చిన వారికి డబ్బులు ఇవ్వకుండా వారం రోజుల క్రితం దుకాణం మూసి వేశారు. వారిద్దరిలో ప్రధానంగా అప్పులు తెచ్చిన వ్యక్తి ఎవరికీ కని పించకుండా ఫోన్‌లు ఎత్తకుండా పరారైనట్లు బాధితులు చెబుతున్నారు.

కర్రోడవాగు కాలువలో మహిళ మృతదేహం

- గుర్తించిన గొలగమూడి గ్రామస్థులు
- 3రోజుల కిందటే మృతి చెంది ఉండొచ్చనే అనుమానం
- ఫిబ్రవరి 20న మరో మహిళ మృతదేహం
- పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్న స్థానికులు

వెంకటాచలం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గొలగమూడి సమీపంలోని కర్రోడ వాగు కాలువలో సుమారు 45ఏళ్ల గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని సోమవారం స్థానికులు గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందివ్వడంతో వారు ఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టు మార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహం ఉబ్బిపోయి దుర్వాసన వస్తుండటంతో మూడు రోజుల కిందట చనిపోయి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గత ఫిబ్రవరి 20న సుమారు 35ఏళ్ల గుర్తుతెలియని మహిళ మృతదే హం కొట్టుకవచ్చింది. అదికాస్తా సర్వేపల్లి కాలువ నుంచి రిజర్వాయర్‌లోకి చేరుకుంది. పోలీసులు అతి కష్టం మీద మార్చి 3న బయటకు వెలికి తీయించారు. అది మరవక ముందే ఇప్పుడేమో ఇపుడిలా జరడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఇద్దరూ మహిళలను ఎవరైనా కొట్టి చంపి కాలువలలో పడేశారా లేక మరేమైనా చేశారా అన్న అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెంట్రింగ్ మేస్త్రీ బలవన్మరణం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తాళలేక సెంట్రింగ్ మేస్త్రీ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు, నగరంలోని పొదలకూరురోడ్డు న్యూఎస్‌బీఐకాలనీలో ఆర్ముగం మురుగేషన్ వెంకటేష్(42), స్వాతి దంపతులు ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు. వెంకటేష్ సెంట్రింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలం కిందట రూ.లక్షల్లో అప్పులు చేసి సెంట్రింగ్ సామాన్లు కొనుగోలు చేశాడు. పనులు సరిగాలేక పోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో అప్పుల వారి నుంచి ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో కుంగిపోయాడు. ఆదివారం అర్ధరాత్రి వరకు భార్యాపిల్లలతో గడిపారు. వారు నిద్రపోగానే పడకగదిలోకి వెళ్లి సీలింగ్ ఫ్యానుకు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం భార్య నిద్రలేచి, పిల్లలను లేపి పడకగది వద్దకు వెళ్లి తలుపులు తెరిచేందుకు ప్రయత్నించగా తెరుచుకోలేదు. లోపల గడియపెట్టి ఉండటంతో పిల్లలతోకలిసి బలంగా నెట్టడంతో తలుపులు తెరుచుకున్నాయి. భర్త ఉరివేసుకుని ఉండటాన్ని చూసి ఆయన్ను కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. ఈ మేరకు స్వాతి వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మత్యాలయ్య సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆకుతోట సమీపాన డాబా దగ్ధం



కాలిపోయిన డాబా పైకప్పు

నెల్లూరురూరల్, ఏప్రిల్ 21,(ఆంధ్రజ్యోతి): నెల్లూరు-ముత్తుకూరు మార్గంలోని నగరంలోని ఆకుతోట సమీపాన కొన్ని రోజులుగా మూతపడిన డాబా ఆదివారం అర్ధరాత్రి అగ్నికి ఆహుతైంది. ఈ డాబా వాడుకలో లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. కాగా మందుబాబులు, ఆకతాయిలు ఎవరైనా మద్యం సేవించి డాబా పైకప్పునకు నిప్పు పెట్టిఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపకదళం అధికారులు మంటలు ఆర్పారు. ఈఘటనపై సోమవారం రూరల్ పోలీసులు ఆరా తీశారు. ఆస్తి నష్టం ఎంత ఉంటుందనేది తెలియాల్సి ఉంది. ఈ ఘటనకు సంబంధించి ఎవరూ పోలీసులకు ఫిర్యాదు చేయలేదు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు...

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : స్పష్టమైన కారణం తెలియదుకానీ నగరంలోని కంసాలివీధిలో కృష్ణచైతన్య ఇంటి కింద పోర్షన్‌లో సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. ఇంట్లో నుంచి దట్టమైన పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు సంతపేట పోలీసులకు సమాచారం అందించారు. వారు అగ్నిమాపక సిబ్బందికి తెలియజేశారు. ఏడీఎఫ్‌వో ఎస్ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఇంట్లోని వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఓ వృద్ధుడి అదృశ్యంపై నగరంలోని చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు ,తిరిసిపేటలో సురేష్ కుటుబం నివాసం ఉంటున్నది. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో ఇంట్లో వారికి భారం కాకూడదని భావించి ఆదివారం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు గాలించినా ప్రయోజనం లేకపోవడంతో సోమవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	100
స్కిన్ చికెన్	184
స్కిన్‌లెస్	204
కోడిగుడ్ల ధర (100):	420



టిడ్కో ఇళ్లు వద్దంటే నగదు వెనక్కు... : ఇన్‌చార్జి కమిషనర్

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): టిడ్కో ఇళ్లు వద్దనుకున్న లబ్ధిదారులకు వారు చెల్లించిన నగదును ప్రభుత్వం తిరిగి ఇస్తుందని ఇన్‌చార్జి కమిషనర్ నందన్ భరోసా ఇచ్చారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన పాల్గొన్నారు. ఇళ్ల కోసం రుణాలు అందని లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన వినతులను శ్రద్ధగా పరిశీలించి క్షేత్ర స్థాయిలో పరిష్కారించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ఆక్రమణలు, మార్టిగేజ్ విడుదల వంటి విషయాల్లో అర్జీదారులను తిప్పించుకోకుండా వాటి పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఎంహెచ్‌వో చైతన్య, సెక్రటరీ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

స్పోర్ట్స్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శాయ్ ఆధ్వర్యంలో పాటియాలలోని లక్ష్మీబాయ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్‌లో 2025-27 సంవత్సరాలకు స్పోర్ట్స్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో ఆర్‌కే.యతిరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి పీజీ డిప్లమో ఇన్ స్ట్రెంగ్త్ అండ్ కండిషనింగ్, పీజీ డిప్లమో ఇన్ స్పోర్ట్స్ పెర్‌ఫార్మెన్స్ అనాలసిస్, పీజీ డిప్లమో ఇన్ స్పోర్ట్స్ సైకాలజీ, పీజీ డిప్లమో ఇన్ స్పోర్ట్స్ న్యూట్రిషన్, పీజీ డిప్లమో ఇన్ ఎక్సర్‌సైజ్ సైకాలజీ, 2025-27 సంవత్సరానికి ఎమ్మెస్సీ స్పోర్ట్స్ కోచింగ్‌లో శిక్షణ అందిస్తారన్నారు. ఆసక్తి కలిగిన వారు www.sse.nsnis.in అనే వెబ్‌సైట్‌లో మార్గదర్శకాలకు అనుగుణంగా మే2లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోని డీఎస్ఏ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

నేదురుమల్లి విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించండి

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో మాజీ సీఎం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఆ పార్టీ నేతలు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం నెల్లూరు సిటీ ఉపాధ్యక్షుడు సంజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సుధీర్ మాట్లాడుతూ నేదురుమల్లి ముఖ్యమంత్రిగానే కాకుండా నాలుగు చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించిన ఏకైక నేత అని పేర్కొన్నారు. జాతీయ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యులుగా ఎంతోమందిని చట్టసభలకు పంపి, వారికి రాజకీయ భవిష్యత్తు అందించిన మహానేత అని తెలిపారు. అలాంటి నేత విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఇర్ఫాన్, మల్లికార్జునరెడ్డి, ధనుంజయ్, సుజాత, బద్రి, సమీర్, రాజశేఖర్ రెడ్డి, రసూల్, నూర్, చాంద్‌బాషా, వరదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితులకు న్యాయం చేయండి

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉడ్‌కాంప్లెక్స్ ప్రాంతంలో నివాసం ఉంటున్న 25 దళిత కుటుంబాలకు పునరావాసం కల్పించాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం రూరల్ కమిటీ కార్యదర్శి కొండా ప్రసాద్ బాధితులతో కలిసి కలెక్టరేట్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందించారు. ఆనంతరం ప్రసాద్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఉడ్‌కాంప్లెక్స్ వద్ద గుడిసెలు వేసుకుని దళితులు చెక్కపనులు చేస్తున్నారని వివరించారు. రోడ్డు విస్తరణ పేరుతో ఆయా కుటుంబాలను రోడ్డున పడేశారన్నారు. వెంటనే వారికి నివాస స్థలాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పెంచల నర్సయ్య, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కత్తులతో కుర్రాళ్లు

- ఇంటి నుంచి బయటకొస్తే చేతిలో ఆయుధం ఉండాల్సిందే !
- నగరంలో ఇటీవల వరుస హత్యలు
- డబ్బు సంపాదనకు హింసామార్గం
- పోలీసుల తనిఖీల్లో నివ్వెరపోయే నిజాలు



నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో వరుసగా జరుగుతున్న నేరాల్లో నిందితులు తమ వెంట కత్తులను తీసుకెళుతున్నారు. పక్కా పథకం ప్రకారమో, క్షణికావేశంలోనే ఆ కత్తులతో కిరాతకంగా దాడి చేసి హత్యలు చేస్తున్నారు. కత్తులను యువకులు బైక్‌లు, ఫ్యాంట్ జేబులు, బొడ్డు, వీపు వెనుక దాచుకోవడం ప్రస్తుతం కల్చర్‌గా మారింది. సినిమాల ప్రభావమో, నగరంలో శాంతిభద్రతల విఫలమో, మాకు అండగా మా నాయకులు ఉన్నారన్న ధైర్యమో తెలియడం లేదు కానీ.. రోజురోజుకు నగరంలో నేరాలు ఘోరాలు పెరిగిపోతున్నాయి.

● అలా తిరగడం స్టైల్

యువత, నేరచరిత్ర కలిగిన వారు ఇంటి నుంచి బయటకు వచ్చే సమయంలో తల్లిదండ్రులకు వెళ్లి వస్తామని చెప్తారో లేదో.. తెలియదు కాని తాము ఇష్టంగా కొనుగోలు చేసిన కత్తులను మాత్రం తమ వెంట తీసుకురావడం మరవడం లేదు. చిన్నచిన్న గొడవలకు కత్తులను బయటకు తీసి, వేసేస్తా.. అంటూ బూతులు తిడుతూ తగ్గేదేలా.. అంటూ సినిమా డైలాగ్‌లు కొడుతున్నారు. నగరంలో గతంలోనూ ఓ కానిస్టేబుల్ ఓ నిందితుడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా కత్తితో మెడపై దాడి చేశాడు. నగరంలో జరుగుతున్న హత్యల్లో 90 శాతం కత్తులతో కిరాతకంగా నరికి చంపినవే. మొత్తం మీద నగరంలో కత్తులను తిరగడం స్టైల్‌గా మారింది.



కత్తితో తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్న యువకుడు, కత్తి (ఫైల్)

● బెదిరింపులు సహజం

నగరంలో ఈనెల 16వతేదీ రాత్రి రెండు హత్యలు జరగడంతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. రాత్రి పూట రోజూ వాహనాల ఆకస్మిక తనిఖీలు, రాత్రి 9 దాటిన తర్వాత రోడ్లపై వెళుతున్న ప్రజలను ఆపి వారి వివరాలు సేకరిస్తున్నారు. ఈ క్రమంలోనే అనుమానాస్పదంగా ఉన్న వారిని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి విచారిస్తున్నారు. వాహనాల తనిఖీలు చేస్తుండగా కత్తులు పెట్టుకొని తిరుగుతున్న వారిని పోలీసులు గుర్తించారు. నగరంలోని గాంధీబొమ్మ వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా ఓ ద్విచక్రవాహనంపై వస్తున్న ఇద్దరిని పోలీసులు ఆపగా వారు పరారయ్యారు. వారిని వెంబడించి పోలీసులు పట్టుకొనే క్రమంలో ఒక వ్యక్తి పరారవ్వగా మరో వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద కత్తి ఉండటంతో తమదైన శైలిలో విచారించగా కత్తులు చూపించి బెదిరించి నగదు దోచుకుంటామని ఆ వ్యక్తి చెప్పడంతో పోలీసులు నివ్వెరపోయారు. ఇలా నగరంలోని అనేక ప్రాంతాల్లో కత్తులను చూపించి బెదిరించడం ఫ్యాషన్‌గా మారిపోయింది. అయితే కత్తులతో బెదిరించి ఉన్నవరకు దోచుకున్నారన్న ఫిర్యాదులు చిన్నబజారు, బాలాజీనగర్, ఇలా అనేక పోలీసు స్టేషన్‌లకు అందాయి.

● ఆపడం సాధ్యమేనా ?

హత్యలు, హత్యాయత్నాలు జరిగిన సమయంలో పోలీసులు వాహనాల తనిఖీలు, అనుమానితులను అదుపులోకి తీసుకోవడం, అర్ధరాత్రిల్లో తిరిగే వారిని ప్రశ్నించడం చేస్తుంటారు. రెండు రోజుల తర్వాత అంతా మామూలే అన్నట్లుగా ఏమీ కన్పించవు. పోలీసులు తనిఖీలు చేసినప్పుడు కత్తులతో తిరుగుతున్న సమయంలో మనకెందుకులే.. అని కనీసం ఉన్నతాధికారులకు చెప్పలేదు. ఇలా పోలీసులు నెలల తరబడి కత్తులతో సహజీవనం చేస్తున్న వారిని వదిలి పెట్టి ఇప్పటికిప్పుడు ఒక్కసారిగా కత్తి కల్చర్‌ను మార్చాలని ప్రయత్నించం సాధ్యమవుతుందా ? అన్న ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

3 నెలల్లో పొదలకూరు రోడ్డు పనుల పూర్తి

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 21,(ఆంధ్రజ్యోతి): నెల్లూరు - పొదలకూరు రోడ్డు పనులను మూడునెలల్లో పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం సంజయ్‌గాంధీ నగర్ వద్ద రూ. 36 లక్షలతో డ్రైనేజీ కాలువ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈరోడ్డు ఆధునీకీకరణలో భాగంగా సీసీరోడ్లు, డ్రైన్లకు రూ. 90 లక్షలు విడుదలైనట్లు తెలిపారు. మూడుమాసాల్లో వీటిని పూర్తి చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. బడ్వాడీపాళెం కూడలి నుంచి సెంట్రల్ లైటింగ్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. నిబంధనలు పాటించి ఎక్కడా వర్షపునీరు నిల్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



డ్రైనేజీ కాలువ పనులకు శంకుస్థాపన చేస్తున్న శ్రీధర్‌రెడ్డి

సూపర్‌సిక్స్‌ను వెంటనే అమలు చేయాలి

● కలెక్టరేట్ ఎదుట సీపీఐ ధర్నా

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సీఎస్ సాగర్ మాట్లాడుతూ తల్లికి వందన పేరుతో ఇంట్లోని ప్రతి విద్యార్థికి రూ. 15వేలు ఇస్తామని సీఎం చంద్రబాబు చెబుతున్నారన్నారు. అయితే నేటికీ ఆ హామీ నెరవేరకపోవటంతో ఎంతోమంది పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగ భృతి కింద రూ. 3వేల ఇస్తామని చెప్పారన్నారు. ఈ నేపథ్యంలో డీఎస్‌ఈ మినహా మరే ఖాళీలు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయలేదన్నారు. ఆడబిడ్డ నిధిగా 18 నుంచి 58 ఏళ్లు ఉన్న ప్రతి మహిళకు రూ. 1500 ఇస్తామని చెప్పి, పథకాన్ని కూటమి ప్రభుత్వం దాన్ని మరిచిపోయిందన్నారు. ఉచిత బస్సు పథకం సర్వేల పేరుతో కాలయాపన చేస్తున్నారని, ప్రతి రైతుకు ఏటా రూ. 20వేల ఆర్థిక సాయం కూడా మరచిపోయారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాసులు, రాంబాబు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునీల్, షారుఖ్, వసంతమ్మ, సరోజని పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ న్యూడెమోక్రసీ నాయకులు

హౌసింగ్ నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలి

● ఏసీబీకి బీజేపీ ఫిర్యాదు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): హౌసింగ్ నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలని ఏసీబీ డీఎస్పీ శిరీషకు ఆమె కార్యాలయంలో సోమవారం బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మిడతల రమేష్ మాట్లాడుతూ నెల్లూరు లేఅవుట్‌లో ఫైనల్ బిల్లులు చేసిన ఇళ్లను తాము పరిశీలిస్తే ఒక్క ఇంటిలో కూడా తలుపులు, కిటికీలు, ఎలక్ట్రికల్, శానిటేషన్ సామగ్రి కనిపించలేదన్నారు. లబ్ధిదారులకు మాత్రం ఇంటి సామగ్రి ఇచ్చినట్లుగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు పేదలకు గృహ నిర్మాణాలు చేపట్టాల్సి ఉందని, అయితే నెల్లూరు అర్బన్‌లో సొంత స్థలాల్లో ఆప్షన్‌త్రీ కింద వందలాది గృహాలు నిర్మించారన్నారు. 90 రోజుల్లో నిర్మాణాలు చేసి బిల్లులు చేయాల్సి ఉండగా, 9 రోజులు, 6 రోజులు, 4 రోజు ల్లోనే గృహాలు నిర్మించినట్లు జియో ఫెన్సింగ్‌లో ఫొటోలు మాయ చేసి బిల్లులు చెల్లించారని ఆ యన ఆరోపించారు. నెల్లూరులోని ఇళ్ల నిర్మాణం లో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, విజిలెన్స్ అధికారులు నివేదిక ఇచ్చినా చర్యలు తీసుకోలేద న్నారు. హౌసింగ్ నిధులపై వెంటనే విచారణ జరిపి అవినీతిపరులను శిక్షించాలని కోరారు. కార్య క్రమంలో బీజేపీ నాయకులు కందికట్ల రాజేశ్వరి, పొట్లూరు శ్రీనివాసులు, యాకసిరి ఫణిరాజు, రఘురామయ్య, చిత్తాతూరు పద్మవతి, తదితరు లు పాల్గొన్నారు.




డీఎస్పీ శిరీషకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

పోలీసుశాఖకు 100 బ్యారికేడ్ల వితరణ

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సామాజిక బాధ్యతలో భాగంగా మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యం అనేక సేవాకార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎస్పీ జీ. కృష్ణకాంత్ అన్నారు. మెడికవర్ ఆసుపత్రి తరపున చైర్మన్ డాక్టర్ అనిల్‌కృష్ణారెడ్డి సూచనలతో నెల్లూరులోని ఆసుపత్రి సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్‌రెడ్డి సోమవారం పోలీసు పరేడ్ మైదానంలో పోలీసుశాఖకు 100 బ్యారికేడ్లను అందజేశారు. వీటిని ప్రారంభించిన ఎస్పీ మాట్లాడుతూ సామాజిక బాధ్యతలో భాగంగా జిల్లాలో పోలీసుశాఖకు మెడికవర్ ఆసుపత్రి అండగా ఉండటం ఆనందంగా ఉందన్నారు.సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్ రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మెడికవర్ ఆసుపత్రులు ఉన్నప్పటికీ నెల్లూరులోని మెడికవర్ ఎంతో ప్రత్యేకమైందన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, నగర డీఎస్పీ సింధుప్రియ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు వెంకటరెడ్డి, రామకృష్ణ, ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ సతీష్, భద్రతా కో-ఆర్డినేటర్ అనీల్, పీఆర్వో చందువర్మ, తదితరులు పాల్గొన్నారు.



రిబ్బన్ కట్ చేసి బ్యారికేడ్లను ప్రారంభిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్



మాట్లాడుతున్న సీడీపీవో లక్ష్మీదేవి

ముర్రుపాలు టీకాలా పని చేస్తాయి

నెల్లూరు (హరనాథపురం) ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, ఫీల్డ్ ఆఫీస్, ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నగరంలోని జనార్దన్‌రెడ్డి కాలనీ మున్సిపల్ ప్రాథమిక స్కూల్‌లో సోమవారం పోషణ్ పక్వాడపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో అర్బన్ సీడీపీవో లక్ష్మీదేవి మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు పుట్టిన గంటలోపు ముర్రుపాలను పట్టించడం వల్ల అవి వ్యాధి నిరోధక టీకాలా పనిచేస్తాయన్నారు. క్షేత్ర ప్రచార సహాయకులు పీ.హరికష్ణ మాట్లాడుతూ పౌష్టికాహారం అందించడంలో భాగంగా కేంద్రం పీఎం పోషణ్, పోషణ్ అభియాన్, పీఎంజీకేఏవై వంటి పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. ఈ సందర్భంగా పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పౌష్టికాహార కిట్లను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి ఆలయంలో జోరుగా అభివృద్ధి పనులు

● దాతల సొమ్ము రూ.కోటితో నిర్మాణాలు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో సుమారు రూ.కోటిపైగా దాతల సొమ్ముతో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆలయంలో వాస్తు దోషాల నవరణ కోసం ఈ పనులు చేపట్టారు. అలాగే పెరుగుతున్న భక్తులకు అవసరమైన సౌకర్యాలను కల్పించడంతోపాటు ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నారు. కంచి పీఠం స్వాముల ఆదేశానుసారం ఆస్థాన సిద్ధాంతి లక్కావర్జున విజయసుబ్రహ్మణ్యం సిద్ధాంతి ఆలయాన్ని పరిశీలించి, చేపట్టాల్సిన పనులను ఆలయ అధికారులు, దాతలు, అర్చకులకు తెలియజేశారు. ఈ పనులను వైదిక కమిటీ సిఫార్సులు, దేవదాయ శాఖ కమిషనర్ అనుమతులతో కళాపకర్షణ పూజలు చేసి ప్రారంభించారు. నవగ్రహ మండపాన్ని మాధవయ్య ఫర్నీచర్స్ వారి సహకారంతో నిర్మిస్తున్నారు. నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, అమ్మవారి విమాన గోపురం, సుందరీకరణ, ఆలయం చుట్టూ సాలహారాలు, ఆలయం లోపల ఉపపీఠం, స్తంభవర్గాలను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతుల సహకారంతో తీర్చిదిద్దుతున్నారు. కాగా, ఆలయంలో జరుగుతున్న సుందరీకరణ, అభివృద్ధి పనులను దాతల సహకారంతో రెండు నెలల్లో పూర్తి చేస్తామని ఈవో, ఏసీ కోవూరు జనార్దన్‌రెడ్డి తెలిపారు. పనులు పూర్తయ్యాక కుంభాభిషేకం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.



రాజరాజేశ్వరి ఆలయంలో నవగ్రహ మండప నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీ జనార్దన్‌రెడ్డి



చిత్రలేఖన పోటీల విజేతలతో బాలభవన్ డైరెక్టర్

ఘనంగా ధరిత్రీ దినోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బాలభవన్ ఆధ్వర్యంలో సోమవారం ఎస్ఆర్‌కే విశ్వసాయి స్కూలులో ధరిత్రీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. యునెస్కో పిలుపిచ్చిన మనశక్తి - మన గ్రహం అన్న అంశంపై విద్యార్థులు బొమ్మలు వేశారు. ఈ సందర్భంగా బాలభవన్ డైరెక్టర్ జీ.సుభద్రాదేవి మాట్లాడుతూ కాలుష్యం తగ్గించేందుకు విరివిగా మొక్కలు పెంచాలని, ప్లాస్టిక్ కవర్లు వాడకం మానివేయాలని కోరారు.

కావలిలో ముస్లింల ర్యాలీ

కావలిటౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకంగా తెచ్చిన మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని ముస్లిం సంఘాల జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. వక్ఫ్‌బోర్డు చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని మాగుంట పార్వతమ్మ రోడ్డుపై నిర్వహించిన నిరసన ర్యాలీ హోరెత్తింది. నల్ల జెండాలు చేతపట్టి జెండాచెట్టు వద్ద ప్రారంభమైన ర్యాలీ ఆర్డీవో కార్యాలయం వరకు సాగింది. తమ డిమాండ్లతో ఆర్డీవోకు వినతిపత్రం అందించారు.



కమిషనర్ సూర్యతేజకు సత్కారం

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : నగర పాలక సంస్థ కమిషనర్‌గా పని చేస్తూ బదిలీపై వెళ్తున్న సూర్యతేజకు సోమవారం ఘన సత్కారం లభించింది. నుడా కార్యాలయంలో చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో సూర్యతేజ దంపతులను గజమాలతో సత్కరించారు. అనంతరం ఆయన నుడా అభివృద్ధికి అందించిన సేవలను కొనియాడారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో మరో సత్కారంతోపాటు సన్మాన సభను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ఓ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కే కార్తీక్, ఎస్పీ కృష్ణకాంత్, ఇన్‌చార్జి కమిషనర్ నందన్, ఎస్ఈ రామ్మోహన్ రావు, మేనేజర్ ఇనయతుల్లా పాల్గొన్నారు.



సూర్యతేజ దంపతులను సత్కరిస్తున్న నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి దంపతులు

దొరతోపు కాలనీలో కార్డన్ సెర్చ్

నెల్లూరురూరల్, ఏప్రిల్ 21,(ఆంధ్రజ్యోతి): నెల్లూరురూరల్ పరిధిలోని నవలాకులతోట వద్దనున్న దొరతోపుకాలనీలో సోమవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ డీఎస్పీ జీ. శ్రీనివాసరావు, సీఐ గుంజి వేణుల నేతృత్వంలో 400 ఇళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, 62 మందితో మాట్లాడారు. సరైనపత్రాలు లేని నాలుగుస్కూటర్లను స్వాధీనం చేసుకున్నారు. అనుమానాస్పద వ్యక్తులు, రౌడీషీటర్లు, స్థానికులతోనూ మాట్లాడారు. శాంతిభద్రతల నేపథ్యంలో ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎక్కడైనా, ఎవరి పైనైనా అనుమానాలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని డీఎస్పీ చెప్పారు. కొత్తగా అనుమా నాస్పద వ్యక్తులు సంచరిస్తే వారి సమాచారాన్ని పోలీసులకు అందచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎస్సైలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
మంగళవారం 22 ఏప్రిల్ 2025



ఆలివ్‌రిడ్లే తాబేళ్లు.. సాగర పర్యావరణ నేస్తాలు

సాగర పర్యావరణ పరిరక్షణలో ఆలివ్‌రిడ్లే తాబేళ్లు కీలకపాత్ర పోషిస్తాయి. సముద్రాన్ని కాలుష్యరహితంగా చేయడంతో తమ వంతు కృషి చేస్తాయి. అందుకే ఈ జాతి తాబేళ్లు అంతరించిపోకుండా జాగ్రత్తలు తీసుకోవల్సిన అవసరముందని గుర్తించారు. జిల్లాలో రెండు కేంద్రాల ద్వారా వీటి వృద్ధికి దోహదపడేందుకు చెన్నైకు చెందిన ట్రీ ఫౌండేషన్, అటవీశాఖలు సమష్టిగా పాటుపడుతున్నాయి.



- 6లో

అలిపిరిలో వాహనాల బారులు



తిరుమలకు ముఖద్వారమైన అలిపిరి చెక్‌పాయింట్ సోమవారం వాహనాలతో కిక్కిరిసిపోయింది. తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగానే ఉన్నప్పటికీ అలిపిరి తనిఖీ కేంద్రం మాత్రం వాహనాలతో రద్దీగా మారిపోయింది. సొంతవాహనాల్లో తిరుమలకు వచ్చేవారి సంఖ్య పెరిగిపోవడంతో పాటు ఇటీవల చోటుచేసుకున్న కొన్ని పరిణామాలతో పటిష్ఠమైన భద్రతా తనిఖీలు చేపడుతున్నారు. ఈక్రమంలో అలిపిరి కేంద్రం ముందు సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వాహనాలు క్యూ కట్టాయి. గరుడ సర్కిల్ వరకు వాహనాలు నిలిచిపోవడంతో ఆ ప్రాంతమంతా రద్దీగా మారిపోయింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఇకపై చేరువగా రిజిస్ట్రేషన్ సేవలు

- రాష్ట్ర వ్యాప్తంగా మూడు దశల్లో..
- 30 నుంచి జిల్లాలో అమలు
- సెలవు దినాల్లోనూ రిజిస్ట్రేషన్లు

తిరుపతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): భూముల రిజిస్ట్రేషన్లు సులభతరం చేసేలా ప్రభుత్వం చురుగ్గా చర్యలు తీసుకుంటోంది. రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గంటల తరబడి వేచి చూసే విధానానికి స్వస్తి పలుకుతూ.. నేరుగా ప్రజలే రిజిస్ట్రేషన్ల కోసం సమయాన్ని నిర్ణయించుకునేలా వెసులుబాటు కల్పిస్తోంది. గత నెల 10వ తేదీన విజయవాడలోని కంకిపాడులో ప్రయోగాత్మకంగా స్లాట్ బుకింగ్ విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నెల 4న రాష్ట్రంలోని 26 జిల్లా ప్రధాన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రారంభించింది. దశల వారీగా నెలాఖరులోగా రాష్ట్రంలోని అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో 'స్లాట్ బుకింగ్' సాగాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ నెల 21, 26, 30వ తేదీలల్లో మూడు విడతలత్లో మొత్తం రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో స్లాట్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. జోన్-4లోని జిల్లాలో మొత్తం 15 రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో(ఫేజ్-3) ఈ నెల 30వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్ సేవలు మొదలవుతాయి. గూడూరు, కోట, నాయుడుపేట, సూళ్ళూరుపేట, వెంకటగిరితో పాటు చిన్నగొట్టిగల్లు, చంద్రగిరి, పాకాల, పిచ్చాటూరు, రేణిగుంట, సత్యవేడు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, తిరుపతి రూరల్, పుత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ సేవలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.



స్లాట్ బుకింగ్ ఇలా...

పబ్లిక్ డేటా ఎంట్రీ (పీడీఈ) సిస్టమ్ ద్వారా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో స్లాట్ బుకింగ్ ప్రారంభించవచ్చు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ముందస్తు అపాయింట్మెంట్‌కు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఎంపిక చేసుకున్న సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా స్లాట్ బుక్ చేసుకోవచ్చు. తమ వివరాలు నమోదు చేశాక డిజిటల్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (డీక్యూఎంఎస్) ద్వారా రిజిస్ట్రేషన్ కోసం టోకెన్ తీసుకోవచ్చు. తర్వాత డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్, వివాహ రిజిస్ట్రేషన్ లాంటి అవసరమైన సేవలను ఎంపిక చేసుకోవచ్చు. స్లాట్ బుక్ చేసే ముందు రోజే ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయడంతో పాటు ఫీజులు కూడా చెల్లించాలి. అనంతరం ఎనీవేర్ రిజిస్ట్రేషన్ ప్రాతిపదికన సిస్టమ్ ద్వారా అప్‌లోడ్ చేసి డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ అధికారులు పరిశీలించి సక్రమంగా ఉంటే ఆమోదిస్తారు. లేదా తప్పులున్న దస్తావేజులను కారణాలు సూచిస్తూ తిరస్కరించే అవకాశం ఉంది. ఒకవేళ, డీక్యూఎంఎస్ రద్దు చేసుకోవాలనుకుంటే రూ.100, మార్పు చేసుకోవాలంటే రూ.200 చెల్లించాలి.

ప్రయోజనాలు ఇవీ

స్లాట్ బుకింగ్ వల్ల సమయం ఆదాతో పాటు కార్యాలయాల చుట్టూ తిరిగే వెతలు తగ్గుతాయి. నిర్ణీత సమయంలోనే కార్యాలయంలో హాజరు కావచ్చు. అనధికార కార్యాకలాపాలు, నకిలీ రిజిస్ట్రేషన్లు కూడా అరికట్టవచ్చు. ఇకపై సెలవు దినాల్లోనూ రిజిస్ట్రేషన్ సేవలు పొందవచ్చు. సమయం ఆదాతో పాటు దళారుల్లేని పారదర్శక సేవలను ప్రజలకు అందించాలన్నది ప్రభుత్వ సంకల్పం. అయితే, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కీలకమైన పబ్లిక్ డేటా ఎంట్రీ (పీడీఈ) అనుభవజ్ఞులు, అవగాహన ఉన్న వారికే సాధ్యమయ్యే పని. సామాన్యులకు అంతగా అర్థమయ్యే విషయం కాదు. మరి ఆచరణకు వచ్చే సరికి ఈ సమస్యను ఎలా అధిగమించాల్సి ఉంటుందనేది చూడాలి.

● బీ అలర్ట్

'కొండ'కు వెళుతున్నారా?

- వాహన చోదకులూ జాగ్రత్తలు తీసుకోండి
- కార్ల దగ్ధం నేపథ్యంలో ఎస్పీ సూచన

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి కార్లలో వస్తున్నారా? అయితే కార్ల యజమానులు, డ్రైవర్లు అన్ని ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ హర్షవర్ధన రాజు సూచించారు. ఇటీవల రెండు కార్ల దగ్ధం నేపథ్యంలో డ్రైవర్లను అప్రమత్తం చేస్తూ సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఇటీవల ఎండా కాలంలో తిరుమలకు వస్తున్న రెండు కార్లు దగ్ధమయ్యాయి. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఇలా కార్లు కాలడానికి కారణాలపై నిపుణులను సంప్రదించగా పలు కారణాలు చెబుతున్నారు. సుమారు 500 కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత ఇంజన్ అప్పటికే వేడిగా ఉంటూ ఒత్తిడిలో ఉంటుంది. ఆ వెంటనే తిరుమల ఘాట్ ఎక్కడం ప్రారంభిస్తే ఇంజన్, ట్రాన్స్మిషన్‌కు అధిక వేడి వస్తుంది. దీంతో పాటు వంకర రోడ్లు, ఘాట్ రోడ్డు ఎక్కాలంటే అధిక ఇంజన్ శక్తి అవసరం. డ్రైవర్లు ఎక్కువగా తక్కువ గేరులో వెళుతుంటారు. దీనివల్ల ఆర్‌పీఎం పెరిగి వేడి పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే అధిక లోడ్‌తో వెళ్లే వాహనాలూ ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. తీర్థయాత్రల్లో బరువు బ్యాగులు, ఎక్కువ మందిని తీసుకెళ్ళడం సాధారణం. పాత వాహనాలు, సరిగా సర్వీసు చేయని వాహనాల్లో కూలెంట్ లీక్‌లు, తక్కువ స్థాయి కూలెంట్ ఉండడం, పాడైన రేడియేటర్లు లేదా ఫ్యాన్లు, థెర్మోస్టాట్ లోపాలు, పాడైన ఇంజన్ ఆయిల్ కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. టూర్‌కు వచ్చే ముందుగా బండిని సర్వీసింగ్ చేయించాలి. రేడియేటర్ లీకేజీలు తనిఖీ చేయాలి. ఫ్యాన్ బెల్టు సరిచూసుకోవాలి. బ్యాటరీల్లో డిస్టిల్ వాటర్ తనిఖీ చేయడం చాలా ముఖ్యం. ప్రతి రెండు గంటలకు ఒకసారి అయిదు నిమిషాల పాటు వాహనం ఆపాలి. వాహనాల డ్యాష్ బోర్డుల మీద థర్మామీటర్, ఆయిల్ గేజ్ మీటర్ పరిశీలిస్తుండాలి. ఘాట్ ఎక్కే సమయంలో ఏసీ ఆఫ్ చేయాలి' అని ఎస్పీ హర్షవర్ధనరాజు వివరించారు.

డిగ్రీ పరీక్షల వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ డిగ్రీ రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ నెల 22, 23 తేదీల్లో జరగాల్సిన ఈ పరీక్షలను మే 12, 14వ తేదీలకు వాయిదా వేశారు. 24వ తేదీ నుంచీ జరిగే పరీక్షలను యథావిధిగా నిర్వహిస్తామని పరీక్షల అధికారి దామ్లా నాయక్ తెలిపారు.

24 నుంచీ పీజీ పరీక్షలు

ఎస్వీయూ పరిధిలో పీజీ రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 24వ తేదీ నుంచీ ప్రారంభం కానున్నాయి. మే ఒకటో తేది దాకా కొనసాగుతాయి. పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సీఈ దామ్లా నాయక్ తెలిపారు.

నేటి నుంచి మంత్రుల పర్యటన

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో మంగళ, బుధ, గురువారాల్లో మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్ పర్యటించనున్నారు. మంగళవారం ఉదయం 8.45 గంటలకు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి రుయాస్పత్రికి.. అనంతరం చిత్తూరుకు వెళతారు. బుధవారం ఉదయం 10 గంటలకు తిరిగి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తిరుపతికి చేరుకుని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్సులో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. మరో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఉదయం 9 గంటలకు శ్రీసిటీలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 నుంచి 6గంటల వరకు రౌతుసూరమాల, శ్రీకాళహస్తి, రేణిగుంటలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. రాత్రికి తిరుపతి పద్మావతి అతిథి గృహంలో బసచేస్తారు. గురువారం ఉదయం పది గంటల నుంచి కలెక్టరేట్‌లో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల అధికారులు, పారిశ్రామికవేత్తలతో మంత్రి సమావేశమవుతారు.



ఉక్కపోతకు ఇంట్లో ఉండలేక బయటకొచ్చిన జనం

తిరుపతిలో 5 గంటల అంధకారం!

- చంద్రగిరి సబ్ స్టేషన్‌లో కాలిన ప్రొటెక్షన్ కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఉక్కపోత. బయటకొస్తే దోమల బెడద. కరెంటు సరఫరా లేకపోవడంతో తిరుపతివాసులు సోమవారం సాయంత్రం దాదాపు ఐదు గంటలపాటు సతమతమయ్యారు. తరచూ కరెంటు రావడం.. మళ్లీ పోవడంతో ఇబ్బంది పడ్డారు. చంద్రగిరి 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో 7.30 గంటలకు ప్రొటెక్షన్ కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. చంద్రగిరి 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి అలిపిరి సమీపంలోని 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌కు.. అక్కడ్నుంచి నగరంలోని 33-11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లకు కరెంటు సరఫరా అవుతోంది. ఈ క్రమంలో తిరుపతితో పాటు చంద్రగిరిలో విద్యుత్ వినియోగం పెరగడంతో 132 కేవీ కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులను నియంత్రించే ప్రొటెక్షన్ కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దీంతో తిరుపతికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సాయంత్రం నుంచి రాత్రి 12.30 గంటల వరకు కరెంటు కాసేపు రావడం.. ఆపై సరఫరా ఆగిపోవడంతో జనం అవస్థలు పడ్డారు. ఇళ్ల బయటే జాగారం చేశారు. నెల రోజులుగా జిల్లాలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. దీనిని అంచనా వేయడంలో అధికారులు విఫలమయ్యారు. ముందస్తుగా 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో స్పేర్‌లో ప్రొటెక్షన్ కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులో ఉంచలేదు. విద్యుత్ వినియోగం పెరిగిందని చెబుతున్న అధికారులు.. ముందస్తు చర్యలు ఎందుకు తీసుకోలేదన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

ఇలాగైతే ఎలా?

- సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరేట్ వద్ద బాధితుల ఆందోళన

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని వివిధ ప్రజాసంఘాలు, రైతులు కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. వీరికి నాయకులు మద్దతు పలికారు. పీజీఆర్ఎస్ సందర్భంగా కలెక్టరేట్ ముందు తమ డిమాండ్లతో ఆందోళన చేపట్టిన వీరు.. అధికారులకు వినతిపత్రాలిచ్చారు.



వక్ఫ్ బోర్డు సవరణ చట్టం రద్దు చేయాలి

కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు సవరణ చట్టం రద్దు చేయాలంటూ కలెక్టరేట్ ఎదురుగా ముస్లిం మైనార్టీలు ఆందోళన చేపట్టగా, సీపీఎం, సీపీఐ, ఆర్‌పీఐ, సీపీఐ(ఎంఎల్), కాంగ్రెస్, వైసీపీ మద్దతిచ్చాయి. హిందువులు, ముస్లింల మధ్య గొడవలు సృష్టించి లబ్ధి పొందేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు హరినాథరెడ్డి ఆరోపించారు. వక్ఫ్ బోర్డు పరిధిలోని భూములను మోదీ ప్రభుత్వం లాక్కుని బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు కుట్ర చేస్తోందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి విమర్శించారు. మహ్మద్ ఖాద్రి, ఇమ్రాన్, ముస్లిం పెద్దలు ఇసాక్‌మాలి, రఫీ హిందూస్తాని, జాఫర్ మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డులో ముస్లింలు కానివారిని మెజార్టీ సభ్యులుగా చేర్చి ఆస్తులను ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టడానికి సవరణ చట్టాన్ని కేంద్రం తీసుకొచ్చిందని విమర్శించారు. ఈ నల్లచట్టాలను తక్షణం ఉపసంహరించుకోవాలని లౌకికరాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ అంజయ్య డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళనలో నాగరాజు, మురళి, యార్లపల్లిగోపి, వెంకటరత్నం, అంకయ్య, లోకేశ్వర్‌రెడ్డి, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూములు ఇవ్వం



సత్యవేడు మండలం ఇరుగుళం, కొల్లడం, పెద్దఈటిపాకం, రాళ్లకుప్పం గ్రామాల్లో 2,583 ఎకరాలను శ్రీసిటీకి కేటాయించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోను రద్దు చేయాలని ఆ ప్రాంత రైతులు డిమాండు చేశారు. కలెక్టరేట్ వద్ద వారు ఆందోళన చేపట్టారు. భూములు ఇవ్వడానికి తాము సిద్ధంగా లేమనానరు. గతంలోను శ్రీసిటీ సెజ్ కోసం కేటాయించిన భూముల విషయంలో తీవ్రమైన అన్యాయం జరిగిందన్నారు. ఇంకా రెండు వేల ఎకరాల భూములు ఖాళీగా ఉన్నాయని, వీటిని మరో వంద కంపెనీలకు ఇవ్వొచ్చన్నారు. మళ్లీ భూముల కోసం తమ వద్దకు వస్తున్నారని, ధరలు కూడా పెరిగాయని అన్నారు. దీనిపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వగా పరిశీలించిన్యాయం చేస్తామని జిల్లా అభివృద్ధికి సహకరించాలని రైతాంగానికి సూచించారు. ఈ ఆందోళనలో రైతులు ప్రతాప్‌రెడ్డి, విజయశంకర్‌రెడ్డి, రామకృష్ణ, శీనయ్య, మనోజ్,మునెమ్మ, అజిత్‌కుమార్ పెద్దఎత్తున రైతులు ఈ నిరసనలో పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

ఎండను లెక్క చేయక..!

- కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు తరలివచ్చిన అర్జీదారులు

'**మండే**' ఎండను లెక్క చేయలేదు. ఇప్పటికైనా తమ సమస్య పరిష్కారం కాకపోతుందా అన్న ఆశతో అర్జీ చేతపట్టుకుని తిరుపతి బస్సెక్కారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు పెద్దసంఖ్యలో అర్జీదారులు పోటెత్తారు. గత సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా పీజీఆర్ఎస్‌కు సెలవు రావడంతో.. ఈ వారం భారీగా రావడంతో కలెక్టరేట్ కిక్కిరిసింది. మొత్తం 372 అర్జీలు రాగా అందులో రెవెన్యూశాఖవే 260 ఉన్నాయి. పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు ఇతర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

చెవిరెడ్డి అనుచరులచే 'మఠం' భూముల కబ్జా

- పూర్తిస్థాయిలో విచారణ జరపాలంటూ టీడీపీ నేతల డిమాండ్

వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతి రూరల్ మండలం దామినేడు నుంచి సి.మల్లవరం వరకు మఠం భూములు, పంట పోరంబోకులను మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అండతో ఆయన అనుచరులు, బినామీలు ఆక్రమించుకున్నారని టీడీపీ నేతలు ఈశ్వరరెడ్డి, అమిలినేని మధు, శ్రీనివాసులు, కిషోర్‌రెడ్డి, పత్తి సుధ తదితరులు జేసీ శుభంబన్సల్ దృష్టికి తీసుకెళ్లారు. మాజీ ఎమ్మెల్యే అనుచరులు భూములను కబ్జా చేసి అడ్డదారిలో పట్టాలు పొందారన్నారు. ఆక్రమణలో ఉన్న భూములను, అక్రమ కబ్జాలపై విచారణ జరిపి మఠం, ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జేసీని కోరారు. నేతలు మధుశేఖర్, సాయి రాయల్, మునికృష్ణారెడ్డి, మునిరత్నంరెడ్డి, టీడీపీశ్రేణులు వినతిపత్రం ఇచ్చారు.



జేసీ శుభం బన్సల్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు



శ్రీవారి సేవలో సినీ ప్రముఖులు

తిరుమల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు సినీ ప్రముఖులు దర్శించుకున్నారు. దర్శకుడు గోపిచంద్ మలినేని, సంగీత దర్శకుడు తమన్, హీరో అశ్విన్‌బాబు ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

నా పేరు యూనివర్స్

నా పేరు యూనివర్స్ రాజకీయపార్టీ పెడుతున్నా, మద్దతివ్వండి.. అని కోరుతూ సోమవారం ఉదయం తిరుపతిలోని ప్రకాశం పార్కు కూడలి వద్ద ఓ వ్యక్తి ఫ్లెక్సీతో నిలబడ్డారు. కోనసీమ ప్రాంతానికి చెందిన తాను రాజకీయ పార్టీ స్థాపించే నేపథ్యంలో ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రాథమికంగా ఈ చర్యకు పూనుకున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం నుంచి మొదలై రెండు వారాలుగా ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో పర్యటించానన్నారు. ప్రస్తుతం రాయలసీమ జిల్లాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు.



- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి


సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 13 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.85 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 82,746

తలనీలాలు సమర్పించినవారు: 25,078





గుమ్మళ్లదిబ్బ తీరప్రాంతంలో తాబేళ్ల సంరక్షణ కేంద్రం





సముద్రంలోంచి తీరానికి వచ్చి ఇసుకలో గుంతలోడి ఇలా గుడ్లు పెట్టి మళ్లీ సముద్రంలోకి వెళ్లిపోతాయి



ఆ గుడ్లను రాత్రి పూట సేకరిస్తారు



వాటిని సంరక్షణ కేంద్రంలో మళ్లీ గుంతలు తీసి పూడుస్తారు

సాగర పర్యావరణ నేస్తాలు

సముద్ర పర్యావరణాన్ని సమతుల్యం చేసే ఆలివ్‌రిడ్లే తాబేళ్ల పరిరక్షణకు ట్రీ ఫౌండేషన్ సంస్థ(చెన్నై), అటవీశాఖలు సంయుక్తంగా కృషి చేస్తున్నాయి.జిల్లాలో రెండు సంరక్షణ కేంద్రాల ద్వారా వీటిని కాపాడుతూ సంతానోత్పత్తి వృద్ధికి దోహదపడుతున్నాయి. చిల్లకూరు మండలం గుమ్మళ్ళదిబ్బ, కోట మండలం శ్రీనివాససత్రం తీరప్రాంతాల్లో ఉన్న ఈ కేంద్రాలు ఆలివ్ రిడ్లే జాతి తాబేళ్లను కంటికి రెప్పలా చూస్తూ సాగర పర్యావరణ హితానికి పాటుపడుతున్నాయి.

- గూడూరు,ఆంధ్రజ్యోతి





గుడ్లనుంచి పిగిలిన తాబేలు పిల్లలు వెళ్లిపోకుండా గంపలు కప్పి పెడతారు

ఇవీ విశిష్టతలు

- ఆలివ్‌రిడ్లే జాతి తాబేళ్లు సుమారు 100 నుంచి 180 ఏళ్ల వరకు జీవిస్తాయి. ● సుమారు 30 నుంచి 40 కేజీల వరకు పెరుగుతాయి.
- ఎక్కడ పుట్టి సముద్రంలోకి వెళతాయో.. తిరిగి అక్కడికే చేరుకుని గుడ్లు పెట్టడం వీటి విశిష్టత.
- సముద్రంలో సుమారు 2000 కిలోమీటర్లు సంచరిస్తుంటాయి.
- గుడ్లు పెట్టే సమయానికి గుంపులుగా తీరంలో తాము పుట్టిన చోటుకు చేరుకుంటాయి. ● రాత్రి వేళ్ల ఒకటిన్నర అడుగు లోతు మేర గుంటను తవ్వుకుని గుడ్లను పెట్టి తిరిగి సముద్రంలోకి వెళతుంటాయి.
- వీటి గుడ్లు 20-35 డిగ్రీల ఉష్ణోగ్రతను మాత్రమే తట్టుకోగలుగుతాయి.
- పుట్టినపుడు 50 గ్రాముల వరకు వుంటుంది.
- ఆడ తాబేలు 12 నుంచి 15 ఏళ్ల వయసులో గుడ్లు పెట్టడం మొదలుపెడతాయి.



● ఆలివ్‌రిడ్లే తాబేళ్ల సంరక్షణకు ట్రీ ఫౌండేషన్, అటవీశాఖల సమష్టి కృషి

వ్యర్థపదార్థాల వల్ల సముద్రం కలుషితంగా మారుతుంది. దీంతో ఎన్నో జీవజాతులు అంతరించిపోతున్నాయి. తాబేళ్లు ఈ వ్యర్థపదార్థాలను, లోపలి ఇతర మొక్కలను, పాచిని తింటూ సాగర జలం కలుషితం కాకుండా చూస్తున్నాయి. ఇవి సముద్ర అడుగు భాగాన్ని పరిశుభ్రం చేస్తుంటాయి. దీంతో పలు రకాల చేపలు పరిశుభ్ర వాతావరణంలో తిరుగుతూ సంతాన ఉత్పత్తిని పెంచుకుంటాయి. చిన్నపాటి చేపల జాతులను నాశనం చేసే జెల్లీఫిష్‌లను తాబేళ్లు అంతమొందిస్తున్నాయి. ఫలితంగా ఆ జాతులు కూడా వృద్ధి చెందుతున్నాయి.

తాబేళ్ల పిల్లల పరిరక్షణ

సాగర పర్యావరణ మిత్రులుగా నిలుస్తున్న తాబేళ్ల సంరక్షణకు,వృద్ధికి ట్రీ ఫౌండేషన్, అటవీశాఖ సంయుక్తంగా పాటుపడుతున్నాయి.ఇందులో భాగంగా స్థానిక మత్స్యకారులకు శిక్షణ ఇచ్చి సీ టర్టిల్ ప్రొటక్షన్ ఫోర్స్‌గా నియమిస్తున్నాయి. ఈ సిబ్బంది సముద్ర తీరంలో తాబేలు గుడ్లు పెట్టిన చోటును గుర్తిస్తారు. తాబేలు సగటున 80 నుంచి 160 వరకు గుడ్లను పెడుతుంది. వీటిని గుడ్డసంచులలో సేకరించి తాబేలు సంరక్షణ కేంద్రానికి తీసుకువస్తారు. తీరాన ఎంత లోతు, విస్తీర్ణంలో గుడ్లను పెడుతుందో అదేవిధంగా కేంద్రాల్లో తాత్కాలిక గూళ్లను ఏర్పాటు చేసి సంరక్షిస్తారు. 48 నుంచి 52 రోజుల తరవాత గుడ్ల నుంచి పిల్లలు బయటకు వస్తాయి. 35 డిగ్రీలు కంటే ఎక్కువ ఉష్ణోగ్రత లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. 30 డిగ్రీల లోపు ఉష్ణోగ్రత ఉన్న సమయంలో ఎక్కువ శాతం మగ తాబేళ్లు, 30 నుంచి 33 డిగ్రీల సమయంలో ఆడ తాబేళ్లు పుడతాయి. పుట్టగానే భద్రంగా వీటిని తీసుకువెళ్లి సముద్రంలోకి వదులుతుంటారు. గత ఏడేళ్లలో గుమ్మళ్లదిబ్బ తీరంలో ఇలా 3685, శ్రీనివాసత్రం నుంచి 1500కి పైగా తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి వదిలారు. సాధారణంగా ఆలీవ్ రిడ్లే జాతి తాబేళ్లు నవంబరు నుంచి మార్చి వరకు గుడ్లు పెడుతాయి. ఏప్రిల్ నుంచి జూన్ వరకు సంరక్షణా కేంద్రాల్లో పిల్లలను సముద్రంలోకి వదులుతుంటారు.





తాబేలు పిల్లలను తిరిగి సముంద్రంలోకి వదులుతారు



మళ్లీ మళ్లీ వాళ్లే..!

● ఎస్పీ కార్యాలయానికి వచ్చినా క్షేత్రస్థాయిలో పరిష్కారం కాని సమస్యలు

● సీఐలు, ఎస్ఐల వద్ద పేరుకుపోతున్న పీజీఆర్ఎస్ ఫిర్యాదులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయానికి వెళితే సమస్య పరిష్కారం అవుతుంది. ఇదీ చాలామందిలో ఉన్న నమ్మకం. దీనికోసం ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వ్యయప్రయాసలకు ఓర్చి అర్జీదారులు వస్తున్నారు. ఇక్కడ్నుంచి ఆయా స్టేషన్లకు పంపితే.. మళ్లీ సమస్య మొదటికే వస్తోంది. దీంతో మళ్లీ మళ్లీ వీరంతా తిరుపతికే రావాల్సి వస్తోంది. జిల్లా పోలీసు కార్యాలయంలోని పీజీఆర్ఎస్‌కు వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యమిస్తూ.. అన్నింటినీ పరిష్కరించే దిశగా ఎస్పీ హర్షవర్ధనరాజు వినూత్న ఆలోచన చేశారు. ఇక్కడ ఫిర్యాదులు పరిశీలించి ఎవరి పరిధి? ఎక్కడకు పంపాలి? ఎందుకు పరిష్కారం కాలేదు అని తెలుసుకోవడానికి ప్రతి వారం ఇద్దరు అదనపు ఎస్పీలు, తొమ్మిది మంది సీఐలు, సిబ్బంది పాల్గొనేలా చర్యలు చేపట్టారు. కానీ, తదనుగుణంగా ఫిర్యాదుల పరిష్కారంలో కొంతమంది అధికారులు చొరవ చూపక పోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉదాహరణకు ఇటీవల అదనపు ఎస్పీ క్రైం నాగభూషణం వద్దకు ఒక మహిళ ఫిర్యాదు తీసుకొచ్చారు. దీనిని పరిశీలించిన ఆయన గత వారం వచ్చావు కదమ్మా..మళ్లీ ఎందుకు వచ్చావని అడిగారు. 'సార్ మీరు సీఐ వద్దకు వెళ్లమన్నారు. అక్కడకు వెళితే రిసెప్షన్‌లో కూర్చున్న పోలీసు సార్ ఒకాయన నన్ను సీఐ వద్దకు పంపడంలేదు. సార్ బిజీగా వున్నారు? రేపు రండి ఎల్లుండి రండి అన్ని తిప్పారు. అందువల్లే మళ్లీ వచ్చాను సార్' అని ఆవేదన వ్యక్తం చేశారామె. చాలా పోలీసు స్టేషన్లలో జరుగుతున్న తంతు ఇదే. దీంతో ప్రతి వారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు పెరుగుతున్నాయి. కాగా, ఎస్పీకి నివేదికలు సమర్పించే క్రమంలో కొందరు తప్పుడు వివరాలు అందిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంపై అర్జీదారులను విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీఐలు

పోలీసు పీజీఆర్ఎస్‌కు 104 ఫిర్యాదులు

జిల్లా ఎస్పీ కార్యాయంలో సోమవారం నిర్వహించిన పోలీసు పీజీఆర్ఎస్‌కు 104 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకున్నారు. తొమ్మిది మంది సీఐల వద్దకు ఫిర్యాదుదారులు వెళ్లి సమస్యలను ఏకరువు పెట్టుకున్నారు. అక్కడ నుంచి ఎస్పీ వద్దకు వెళ్లారు. వాటిని పరిశీలించి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, సీఐలు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన కల్పించండి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా మలేరియా వ్యాధిని నిర్మూలించవచ్చునని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టర్‌లో సోమవారం ప్రపంచ మలేరియా దినోత్సవం పోస్టర్లు, బ్యానర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారమూ డ్రైడే పాటించి దోమలు వ్యాప్తి చెందకుండా, పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, జిల్ల మలేరియా అధికారి రూప్‌కుమార్, డీసీహెచ్ఎస్ ఆనందమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ పెండింగ్ పనులను వేగవంతం చేయాలి

వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ నాయుడుపేట, మేనకూరు మండలాలకు సంబంధించిన ఏడు గ్రామాల్లో భూసేకరణ, రోడ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తిరుపతి ఏపీఐఐసీ జోనల్ మేనేజరు విజయభరత్‌రెడ్డి పాల్గొన్నారు.



చంద్రబాబు, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న రవి నాయుడు, డీఎస్సీ అభ్యర్థులు

ఆరేళ్ల కల నిజమాయె

డీఎస్సీపై చంద్రబాబు, లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

తిరుపతి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ అభ్యర్థుల ఆరేళ్ల కలను సీఎం నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖా మంత్రి లోకేశ్ సాకారం చేశారని శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు అన్నారు. కూటమి ప్రభుత్వం డీఎస్సీని విడుదల చేసి ఇది మంచి ప్రభుత్వమని మరోసారి నిరూపించుకుందన్నారు. డీఎస్సీ విడుదల సందర్భంగా తిరుపతి ఆర్డీవో ఆఫీసు ఎదుట డీఎస్సీ అభ్యర్థులు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులతో కలిసి సోమవారం చంద్రబాబు, లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. 'థ్యాంక్యూ సీఎం సర్, లోకేశ్ అన్న' అంటూ డీఎస్సీ అభ్యర్థులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. రవినాయుడు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఇదే ప్రాంతంలో నిరసనలు, ధర్నాలు చేపట్టామని, కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవని అన్నారు. అన్ని కేటగిరీలకు న్యాయం జరిగేలా ప్రస్తుత ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్ మాట్లాడుతూ డీఎస్సీ విడుదల పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని, చెప్పినట్టుగానే 16,347 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారని అన్నారు. ఇప్పటికైనా మాజీ సీఎం జగన్ రెడ్డి బుద్ధి తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, రాష్ట్ర సభ్యులు ఆర్కే నాయుడు, విష్ణు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ప్రత్యేక మెడికల్ క్యాంపు

తిరుపతి(విద్య), ఏప్రిలల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలోని ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ప్రత్యేక మెడికల్ క్యాంపును తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో నిర్వహించనున్నట్లు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ తెలిపారు. స్టేట్ టీచర్స్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్ యాక్ట్ 2025 ప్రకారం ప్రిఫరెన్షియల్ కేటగిరీ, స్పెషల్ పాయింట్స్ పొందాల్సిన ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా మెడికల్ క్యాంపునకు హాజరుకావాలని సూచించారు. ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు రుయా ఆసుపత్రిలో పాత ఆరోగ్య సర్టిఫికెట్లను చూపించి, సంబంధిత వైద్యులతో పరిశీలన చేయించుకుని కొత్త సర్టిఫికెట్లు పొందాలని సూచించారు. వీటి ఆధారంగానే బదిలీల్లో ప్రిఫరెన్షియల్, స్పెషల్ పాయింట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు.

టీడీపీ నేతపై హత్యాయత్నానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

రుయాలో చికిత్స పొందుతున్న వెంకటేష్‌కు శాప్ ఛైర్మన్ పరామర్శ

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేతలపై దాడులకు, హత్యాయత్నాలకు పాల్పడుతున్న వైసీపీ మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు కోరారు. వైసీపీ నేతల దాడిలో గాయపడి రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్న 1వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వెంకటేష్‌ను సోమవారం టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, ఏపీ యూఎఫ్ఐడీసీ ఛైర్మన్ వూకా విజయ్‌కుమార్‌తో కలిసి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతిలో మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఆయన కుమారుడు అభియన్ అండదండలతో వైసీపీ నేతలు దాడులకు, హత్యాయత్నాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని టీడీపీ నేతలను భయభ్రాంతులకు గురిచేయాలనే ఆలోచనతోనే ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. చిల్లర రాజకీయాలు ఎన్ని చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. వైసీపీ దాడులకు, బెదిరింపులకు టీడీపీ నేతలు భయపడరని స్పష్టం చేశారు. నరసింహయాదవ్, మునికృష్ణ మాట్లాడుతూ ప్రశాంతమైన తిరుపతిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు రుయాకు చేరుకొని వెంకటేష్‌ను పరామర్శించి భరోసా కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు శంకర నారాయణ పాల్గొన్నారు.



వెంకటేష్‌ను పరామర్శిస్తున్న రవినాయుడు, టీడీపీ నేతలు

వాచీల ఈ-వేలం

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాల్లో హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన వాచీలను మే 1, 2 తేదీల్లో ఈ-వేలం నిర్వహించనున్నారు. టైటాన్, సిటిజన్, సొనాట, రాగా, టైమ్స్, టైమెక్స్ ఇతర కంపెనీల స్మార్ట్ వాచీలు 62 లాట్లు కొత్తవి, ఉపయోగించిన, పాక్షికంగా దెబ్బతిన్నవి ఉన్నాయి. ఇతర వివరాలకు తిరుపతిలోని మార్కెటింగ్ కార్యాలయం 0877- 2264429, టీటీడీ వెబ్‌సైట్, రాష్ట్ర ప్రభుత్వ కొనుగోలు పోర్టల్‌ను సంప్రదించాలని టీటీడీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.

రెండు మోటర్ సైకిళ్ల ఢీ

ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు


మృతి చెందిన మస్తాన్

ఓజిలి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం పెద్దపరియ క్రాస్ రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం రాత్రి రెండు మోటర్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గూడూరుకు చెందిన మస్తాన్(40) మృతి చెందగా, అదే మండలంలోని లింగసముద్రం గ్రామానికి చెందిన సుధీర్, ప్రవీణ్ కుమార్ గాయపడ్డారు. ఓజిలి ఏఎస్ఐ గురుమూర్తిరాజు కథనం మేరకు... పెద్దపరియ క్రాస్‌రోడ్డు సమీపంలో ఉన్న ఓ తారు ప్లాంటులో గూడూరుకు చెందిన మస్తాన్ డ్రైవర్, వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి మండలంలోని రాజుపాళెం గ్రామానికి మోటరు సైకిల్‌పై వెళ్లి తిరిగి రాంగ్ రూట్‌లో వస్తుండగా లింగసముద్రం గ్రామానికి చెందిన సుధీర్, ప్రవీణ్ కుమార్ మోటర్ సైకిల్‌పై వెళ్తూ పెద్దపరియ క్రాస్‌రోడ్డు వద్ద ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో మస్తాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిని సుధీర్, ప్రవీణ్‌కుమార్‌ను 108 వాహనంలో గూడూరు ఆస్పత్రికి తరలించారు. ప్రవీణ్ కుమార్ పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో టైలర్ మృతి


నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలో టైలరింగ్ దుకాణం నిర్వహిస్తున్న విజయమోహన్(34) నాయుడుపేటలోని తన దుకాణానికి వచ్చాడు. అయితే రాత్రి ఇంటికి వెళ్లలేదు. అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. పెళ్లకూరు మండలం చెంబేడు గ్రామానికి చెందిన విజయ మోహన్ నాయుడుపేట పట్టణంలో టైలరింగ్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఉదయం చెంబేడు నుంచి దుకాణానికి వెళ్లాడు. అయితే రాత్రి ఇంటికి వెళ్లలేదు. సోమవారం ఉదయం తిమ్మాజికండ్రిగ చెరువులో విజయమోహన్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని అర్బన్ సీఐ బాబి పరిశీలించారు. విజయమోహన్ మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి బట్టలు చెరువు గట్టుపై లభ్యమయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్తులను పరిరక్షించేందుకే వక్ఫ్ చట్టం


వక్ఫ్ ఆస్తులపై అవగాహన కల్పిస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ముస్లిం సమాజానికి సంబంధించిన ఆస్తులను పరిరక్షించేందుకే వక్ఫ్ చట్టం ఉందని సీపీఎం నాయకుడు జోగి శివకుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని పెద్దమసీదు, మున్సిపల్ కార్యాలయం, మార్కెట్ సెంటర్ తదితర ప్రాంతాల్లో వక్ఫ్ ఆస్తులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టం పార్లమెంటులో ఆమోదం పొందిన తీరు ముస్లింలలో తీవ్ర ఆందోళనకు దారితీసేవిధంగా ఉందన్నారు. కేంద్రప్రభుత్వం ఈ తరహా విధానాలను ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీవీ రమణయ్య, జంషద్ ఆహ్మద్, శంకరయ్య, గౌతమ్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న మయూరి శ్యామ్‌యాదవ్

గూడూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమవారం తిరుపతిలో రాష్ట్ర అబ్జర్వర్, డీఎస్‌డీవో సయ్యద్ సాహెబ్, రిటర్నింగ్ అధికారి చంద్రశేఖర్ పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా మయూరి శ్యామ్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా కోటేశ్వరరావు, మల్లికార్జున, కార్యదర్శిగా చెంచయ్య, జాయింట్ సెక్రటరీలుగా రమేష్, రాంబాబు, టెజరర్‌గా మహేష్, సభ్యులను ఎన్నుకున్నారు.

కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ప్రమాదం

తిరుపతి (సెంట్రల్), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): చెంగల్‌పట్టు - కాచిగూడ మధ్య రాకపోకలు సాగించే కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌కు రేణిగుంట రైల్వే జంక్షన్‌లో రెండు రోజుల క్రితం పెను ప్రమాదం తప్పినట్లు తెలిసింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం రాత్రి చెంగల్‌పట్టు నుంచి కాచిగూడకు వెళుతున్న కాచిగూడ ఎక్స్‌ప్రెస్(17651) నిర్ణీత సమయానికి రేణిగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. తిరిగి 8 గంటలకు బయలుదేరిన ఈ రైలు 5వ నంబరు ప్లాట్‌ఫారం నుంచి కడప వైపు వెళ్లాల్సి ఉంది. అయితే విజయవాడ మార్గంలోకి మళ్లింది. స్టేషన్ యార్డు దాటుతున్న సమయంలో డ్రైవర్ ఈ విషయాన్ని గ్రహించి రైలు నిలిపి స్టేషన్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. అధికారులు స్పందించి దారి తప్పిన రైలును తిరిగి 5వ నెంబరు ప్లాట్‌ఫారానికి రప్పించి, కడప మార్గం నుంచి పంపినట్లు తెలిసింది. ఈ కారణంగా బెంగళూరు - బాగల్‌పూర్, చెన్నై-ముంబయి వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లు ఆలస్యమయ్యాయి. దీనిపై వివరణ కోసం ప్రయత్నించగా అధికారులు స్పందించలేదు. కాగా, రైలు దారి తప్పిన సమయంలో విజయవాడ మార్గంలో మరో ఎక్స్‌ప్రెస్ వచ్చివుంటే భారీ ప్రమాదం జరిగి ఉండేదని ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు.

ఎస్పీ కార్యాలయంలో తనిఖీలు


ఎస్పీ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న ఎస్పీ హర్షవర్ధన రాజు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఎస్పీ హర్షవర్ధన రాజు ఆకస్మిక తనిఖీలు చేశారు. సిబ్బంది పనితీరుపై ఫిర్యాదులు రావడంతో కార్యాలయంలోని అన్ని విభాగాలను తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. తనకు ప్రతిరోజూ నివేదికలు అందుతున్నాయని, సక్రమంగా విధులకు హాజరుకాకుండా రాజకీయాలు చేసే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రతినెలా మూడో శనివారం పరిసరాలను శుభ్రం చేసుకోవాలని చెప్పినా పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన ఇటీవల ఆధునీకరించిన పోలీసు ఆస్పత్రిని పరిశీలించారు. వసతులపై అక్కడున్న వారిని అడిగి తెలుసుకున్నారు.

అగ్రిటెక్‌పై నేటి నుంచి జాతీయ సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కాలేజీలో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు అసోసియేట్ డీన్ డాక్టర్ రమణ వెల్లడించారు. వ్యవసాయ సాంకేతికత - ఆహార భద్రత అంశంపై ఈ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేత్రదానం


అమరేంద్రరెడ్డి (ఫైల్‌ఫొటో)

తడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెండ్లూరుపాడు గ్రామానికి చెందిన వేనాటి అమరేంద్రరెడ్డి(53) సోమవారం మృతి చెందారు. ఆయన నేత్రాలను సూళ్లూరుపేటలోని ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ఆధ్వర్యంలో చెన్నై శంకర్ నేత్రాలయకు దానం చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అలపాటి అశోక్, ఎంఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలు

దొరవారిసత్రం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మావిళ్లపాడు మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశ పరీక్షలు సోమవారం ముగిశాయి. ఆదివారం, సోమవారం రెండు రోజులు ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. 113 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 104 మంది పరీక్ష రాసినట్లు ప్రిన్సిపాల్ సుమలత తెలిపారు.

ప్రతి ఎకరానికీ 'గంగ': విజయశ్రీ


గంగనీటి గురించి ఎమ్మెల్యే విజయశ్రీకి వివరిస్తున్న ఈఈ రాధాకృష్ణమూర్తి, పక్కన మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు తెలుగుగంగ నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. సోమవారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో తెలుగుగంగ అధికారులు, రైతులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో రెండో పంటకు సాగునీటి అవసరం ఉందని, నియోజకవర్గంలో పెళ్లకూరు, నాయుడుపేట, ఓజిలి, దొరవారిసత్రం, సూళ్లూరుపేట మండలాలకు 7 బ్రాంచ్ కెనాల్, 8 ఏ, 8బి బ్రాంచ్ కాలువలకు గంగనీటిని విడుదల చేసి సాగుకు నీరందిస్తామన్నారు. కండలేరు నుంచి నీరొచ్చే సత్యసాయి తెలుగు గంగ కెనాల్ మరమ్మతులు చేస్తున్న కారణంగా నీటి విడుదల ఆలస్యమైందన్నారు. మే 5న గంగనీటిని విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నామని, దిగువ చివరి భాగంలో ఉన్న భూములకు సైతం సాగునీరు అందుతుందని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సూళ్లూరుపేట పట్టణానికి తాగునీరు అందించేందుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాన్ చొరవతో రూ.470 కోట్లు మంజూరయ్యాయని మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం తెలిపారు. సమావేశంలో తెలుగుగంగ ఈఈ రాధాకృష్ణమూర్తి, డీఈలు శ్రీనివాసులు, గజేంద్రరెడ్డి, ఏఈలు రాజేష్, గోపికృష్ణ, హరీష్, టీడీపీ నాయకులు కొక్కు శంకరయ్య, ఏజీ కిషోర్, కామిరెడ్డి మురళీరెడ్డి, వేనాటి రాజారెడ్డి, సంచి కృష్ణయ్య, విజయ నాయుడు, నీటి సంఘ అధ్యక్షుడు రమణయ్య, వెంకరమణ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు


వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ శివశంకర్

డక్కిలి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఎస్‌ఐ శివశంకర్ తెలిపారు. సోమవారం మండలంలోని కంథలవారిపల్లి వద్ద జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ లేకుండా తిరుగుతున్న ద్విచక్ర వాహనదారులను ఆపి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇకపై హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకొంటమాని హెచ్చరించారు. ఇక మద్యం తాగి వాహనం నడిపితే రూ.10 వేల వరకు జరిమానా విధిస్తామన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే డ్రైవర్‌పై కేసులు నమోదు చేస్తామన్నారు. వాహనం నడిపేటప్పు డ్రైవింగ్ లైసెన్సుతో పాటు ఇతర పత్రాలు వెంట తీసుకెళ్లాలని సూచించారు.

ఆగిఉన్న లారీని ఢీకొన్న మరో లారీ


ప్రమాదంలో దెబ్బతిన్న లారీ

గూడూరు అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఆగిఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన ఘటన జాతీయ రహదారిపై పోటుపాళెం కూడలి సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు... తెలంగాణ నుంచి మిర్చి లోడుతో చెన్నై వెళుతున్న లారీ పోటుపాళెం కూడలి వద్ద రోడ్డు పక్కన ఆగింది. గోదావరి జిల్లా నుంచి ధాన్యం లోడుతో కేరళ వెళుతున్న మరో లారీ అదుపుతప్పి ఆగిఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ధాన్యం లారీ డ్రైవర్ ప్రకాష్, క్లీనర్ శ్యామ్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. ఘటనా స్థలానికి చేరుకున్న రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ లారీలో ఇరుక్కుపోయిన ప్రకాష్, శ్యామ్‌లను బయటకు తీసి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. రోడ్డుపై పడినపోయిన లారీని పక్కకు తీయించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేరుశనగ పంటకు పరిహారం


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న అధికారులు

కోట, ఏప్రిల్ 21: కోట మండలం కొత్తపట్నం పంచాయతీ శ్రీనివాససత్రం ప్రాంతంలో వేరుశనగ పంట సాగు చేసిన రైతులకు పరిహారం అందించారు. కొత్తపట్నం పంచాయతీలోని శ్రీనివాససత్రం వద్ద చెన్నై, బెంగళూరు కోస్టల్ కారిడార్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. అయితే చెన్నై, బెంగళూరు కోస్టల్ కారిడార్‌కు ఇచ్చిన భూముల్లో రైతులు వేరుశనగ సాగు చేశారు. పంట దిగుబడి తీసుకునేందుకు వ్యవధి కావాలని కోరుతూ రైతులు నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, సబ్‌కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ జయజయరావు రైతులు సాగు చేసిన వేరుశనగ పంట ఎకరానికి రూ.15వేలను సోమవారం రైతులకు చెల్లించారు. దీంతో రోడ్డు పనులు చేపట్టేందుకు రైతులు అంగీకారం తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ గోపిరెడ్డి, వీఆర్వో వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

అధ్యాపకుడికి సన్మానం


పీరకుమార్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

గూడూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ పీరకుమార్ ఇటీవల కందుకూరి రంగస్థల పురస్కారం అవార్డును అందుకోవడంతో సోమవారం కళాశాలలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ పీరకుమార్ అధ్యాపకుడిగా పనిచేస్తూ వివిధ నాటక పరిషత్‌లలో పాల్గొని నటుడిగా ప్రతిభచూపుతూ, రచయతగా రాణిస్తున్నాడని కొనియాడారు. ఆయన ప్రతిభను గుర్తించిన హైదరాబాదుకు చెందిన మెగా హెల్పింగ్ ఫౌండేషన్ సంస్థ గతంలో ఆయనకు నంది అవార్డును అందించడం జరిగిందన్నారు. ఈనెల 16వ తేదీన కందుకూరి వీరేశలింగం జయంతి సందర్భంగా విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం పీరకుమార్‌కు కందుకూరి రంగస్థల ప్రతిష్టాత్మక విశిష్ట పురస్కారాన్ని అందజేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, నారాయణరాజు, కోటేశ్వరరావు, విజయ్‌మహేష్, ఝాన్సీరాణి, సురేంద్ర, శైలజ, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ కేంద్రం నిర్వాహకులపై విచారణ చేపట్టాలి

గూడూరు అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రం నిర్వాహకులపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశి కుమార్ సోమవారం కోరారు. మండలంలోని అయ్యవారిపాళెం గ్రామానికి చెందిన నారాయణమ్మ గత కొన్ని సంవత్సరాలుగా డయాలసిస్ చేయించుకుంటోందన్నారు. అయితే గత మంగళవారం డయాలసిస్ చేస్తుండగా ఆమె చనిపోయిందన్నారు. దీనిపై అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టి మృతి గల కారణాలను తెలియజేసి బాధిత కుటుంబసభ్యులకు న్యాయం చేయాలన్నారు.

ప్రతి గిరిజనుడికీ ఆధార్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో గోపి


కోట, ఏప్రిల్ 21: మండలంలో ప్రతి గిరిజనుడికీ ఆధార్ కార్డు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో గోపి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, మహిళా పోలీసులతో సమీక్ష జరిగింది. మండలంలోని 21 పంచాయతీల్లో 7860 మంది గిరిజనులు నివాసం ఉంటున్నారని, వారందరికీ తప్పనిసరిగా ఆధార్ ఉండేలా చూడాలన్నారు. ఇందుకోసం గ్రామాల్లో సర్వే వేగవంతం చేయాలని, ఎక్కడైనా లోపాలు జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ వేణు తదితరులు పాల్గొన్నారు.

తిన్నెలపూడిలో క్యాన్సర్ పరీక్షలు


క్యాన్సర్ పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కోట, ఏప్రిల్ 21: మండల పరిధిలోని తిన్నెలపూడిలో తిరుపతిలోని వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(స్విమ్స్) ఆధ్వర్యంలో సోమవారం క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ హరిత, డాక్టర్ నాగరాజు మహిళలకు రొమ్ము, నోటి క్యాన్సర్ పరీక్షలు చేశారు. పలువురికి మమోగ్రామ్ పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆధ్వర్యంలో తిన్నెలపూడి, లక్ష్మక్కకండ్రిగ, చెంబడిపాళెం గ్రామాల్లో క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశా వలంటీర్లు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నాగరాజు

పెళ్లకూరు, ఏప్రిల్ 21: మండలంలోని సవటకండ్రిగ వద్ద జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం ఎస్‌ఐ నాగరాజు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. రికార్డులు లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ బుక్ కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ మునిస్వామి, కానిస్టేబుల్ గోపి పాల్గొన్నారు.

28నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇస్కాన్ టెంపుల్ ఎదురుగా ఉన్న రామకృష్ణమిషన్ ఆశ్రమంలో ఈనెల 28నుంచి వచ్చే నెల 18వ తేదీ వరకు 'సంస్కార శిబిరం' పేరిట పిల్లలకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆశ్రమ ప్రతినిధి శ్రీకాంత్ మహరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగాసనాలు, ఆర్ట్ క్రాఫ్ట్, డ్రాయింగ్, భజనలు, సంస్కృత శ్లోకాలు, శ్రీమద్ భగవద్గీత, పూలమాల తయారీ విధానం, భారత సనాతన సంస్కృతి, కర్రసాము, విలువిద్య, వ్యక్తిత్వవికాసం వంటి వాటిలో ఉదయం 8.15నుంచి మధ్యాహ్నం 12.15వరకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. 5 నుంచి 10వ తరగతి బాలబాలికలు మాత్రమే అర్హులని వివరించారు. ముందు వచ్చినవారికి ముందు ప్రాధాన్యత ప్రాతిపదికన పేర్లను నమోదు చేసుకుంటారని, పూర్తిగా శ్వేత వస్త్రధారణతో రావాల్సి ఉంటుందని వెల్లడించారు. రూ.1,200 రుసుం చెల్లించాల్సి ఉంటుందని, ఉదయం ఉపాహారం అందజేస్తారని, మరిన్ని వివరాలకు 9493107001, 6360150945లను సంప్రదించాలని కోరారు.

రేపటి నుంచి భాష్యకార్ల ఉత్సవం

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి ఆలయంలో ఈనెల 23 నుంచి మే 3వ తేదీ వరకు భాష్యకార్ల ఉత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉదయం 7.30 గంటలకు భాష్య కార్లను బంగారు తిరుచ్చిపై ఆలయ చిన్నమాడ వీధి ఉత్సవం, సాయంత్రం 6.30 నుంచి 8 గంటల వరకు పెద్ద మాడ వీధి ఉత్సవం నిర్వహిస్తారు. ఉదయం ఊరేగింపు అనంతరం ఆలయంలో తిరుమంజనం, శాత్తుమొర, ఆస్థానం జరగనుంది. మే 1న భోగి తేరు, 2న శాత్తుమొర, 3న గంధంపొడి ఉత్సవం నిర్వహించనున్నారు.

పందుల పెంపకం లాభదాయకం

తిరుపతి రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ పద్ధతిలో పందుల పెంపకం మరింత లాభదాయకంగా ఉంటుందని ఎస్వీ వెటర్నరీ వర్శిటీ డీన్ డాక్టర్ కె.వీర బ్రహ్మయ్య తెలిపారు. వెటర్నరీ కళాశాలలో పశు ఉత్పత్తుల సాంకేతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పందుల పెంపకంతో ఆదాయార్జన ప్రాజెక్టులో భాగంగా 2024-25 విద్యా సంవత్సరానికి బీవీఎస్సీ విద్యార్థులకు శిక్షణ నిర్వహించి సర్టిఫికెట్లు, చెక్కులు అందించారు. డీన్ మాట్లాడుతూ విద్యార్థిగా ఉంటూ చదువుతోపాటుగా పందుల పోషణ, యాజమాన్యం, ఆరోగ్యం, మార్కెటింగ్ వంటి అంశాలపై శాస్త్రీయ అధ్యయనం చేసి శిక్షణ పూర్తి చేసిన వారిని అభినందించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య మాట్లాడుతూ దేశంలో తొలిసారిగా 1969లో తిరుపతిలోని వెటర్నరీ కళాశాలలో ఈ ప్రోగ్రాంను ప్రారంభించి ఏటా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. ఎల్పీటీ హెడ్ డాక్టర్ జి.విజయ భాస్కర్‌రెడ్డి మాట్లాడారు. ఈ ఏడాది శిక్షణ పూర్తి చేసుకున్న 22 మంది విద్యార్థులకు రూ.4,400 చొప్పున చెక్కులు, సర్టిఫికెట్లు అందించారు. అధ్యాపకులు డాక్టర్ సుధీర్, డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.

పవిత్రమైనది ఉపాధ్యాయ వృత్తి


వెంకటరమణయ్య దంపతులను సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కోట, ఏప్రిల్ 21: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఎంఈవో దారా మస్తానయ్య అన్నారు. మండల పరిధిలోని గూడలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పదవి విరమణ చేసిన బట్టా వెంకటరత్నం అభినందన సభ సోమవారం జరిగింది. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘ నేతలు వెంకటరత్నం దంపతులను పూలమాలలు, శాలువాలు, జ్ఞాపికలతో అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నేతలు మనోహర్, నుమాయిష్, తూపిలి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మక్కువ పెంచుకోవాలి


తిన్నెలపూడిలో ర్యాలీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు

కోట, ఏప్రిల్ 21: ప్రకృతి వ్యవసాయంపై రైతులు మక్కువ పెంచుకోవాలని వెలుగు ఏపీఎం అనీల కోరారు. మండల పరిధిలోని తిన్నెలపూడిలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ప్రతినిధుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ జరిగింది. ఇంటింటా తిరిగి ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు పెట్టుబడుల కోసం పొదుపు సంఘాల ద్వారా రుణాలు ఇప్పిస్తామన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయాధికారి దినేష్, ఎఫ్‌టీవో శంకర్, మోడల్ మేకర్ శ్రీనివాసులు, పద్మ, శివకుమారి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని ఎనిమిది గేదెల మృతి

పెళ్లకూరు ఏప్రిల్ 21: వాహనం ఢీకొని ఎనిమిది గేదెలు మృతిచెందిన ఘటన సోమవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... టెంకాయతోపు సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారు జామున గేదెలు రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎనిమిది గేదెలు మృతి చెందాయి. కేసు నమోదు చేశామని, మృతి చెందిన గేదెల కోసం ఎవ్వరూ రాలేదని ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

కలెక్టరేట్‌లో క్యాంటీన్ ప్రారంభం

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్ ప్రారంభించారు. కాగా, మూడేళ్ల క్రితం మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి అనుచరుడు కలెక్టరేట్‌లో క్యాంటీన్‌ను అద్దెకు తీసుకున్నాడు. రూ.5 లక్షల అద్దె ఎగ్గొట్టి ఖాళీ చేసి వెళ్లాడు. అధికారులు అతడికి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు.